




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 89, పేజీలు - 08

బుధవారం, సెప్టెంబర్ 3, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD








## బీఆర్ఎస్ నుంచి కవిత సస్పెన్షన్

**- కవితను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటన విడుదల చేసిన బీఆర్ఎస్**

**- కవిత తీరు పార్టీకి నష్టం కలిగించే రీతిలో ఉందని పేర్కొన్న బీఆర్ఎస్**

**- తక్షణమే ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు వెల్లడి**

ఉందని బీఆర్ఎస్ నుంచి ఆమెపై వేటు వేశారు. కవిత చేసే వ్యాఖ్యలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సీరియస్‌గా తీసుకున్నారు.

**కొంతకాలం నుంచి కవిత ధిక్కార స్వరం..**

ఎమ్మెల్సీ కవిత బిఆర్ ఎస్ లో కొనసాగుతూనే గత కొంత

**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** అంతా ఊహించిందే జరిగింది. బిఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీ కవితను సస్పెండ్ చేసేందుకు పార్టీ అధినేత , కవిత తండ్రి కేసీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆయన ఆదేశాలతో పార్టీ క్రమశిక్షణా కమిటీ కవితను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. కేసీఆర్ ఆదేశాలతో నిర్ణయం తీసుకున్నట్లు సోమభరత్ కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. గత కొంతకాలం నుంచి కవిత వ్యవహారం పార్టీకి నష్టం చేకూర్చేలా కాలంగా పార్టీకి వ్యతిరేకంగా మ్టాట్లడుతున్నారు. ఏకంగా తన తండ్రి , బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వాన్ని ప్రశ్నించే స్థాయిలో ఆమె కామెంట్స్ పీక్స్ కు చేరుకున్నాయి. పార్టీలు దెయ్యాలు కేసీఆర్ ను నడిపిస్తున్నాయంటూ మొదలైన కవిత ధిక్కార స్వరం, అక్కడితో ఆగలేదు అనేకసార్లు పార్టీ విధానాలపై, పార్టీలో కీలక నేతలపైన తీవ్ర స్థాయిలో బహిరంగ విమర్శలు చేస్తూ వచ్చారు. తన తండ్రి దేవుడు అంటూనే ,

2లో..



భారత రాష్ట్ర సమితి
BHARAT RASHTRA SAMITHI
Office : Telangana Bhavan, Road No : 10, Banjara Hills, Hyderabad 500 034.

Date: 02.09.2025

పార్టీ MLC శ్రీమతి కే. కవిత ఇటీవలి కాలంలో ప్రవర్తిస్తున్న తీరుతెన్నులు , కొనసాగిస్తున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు బి.ఆర్.ఎస్ పార్టీకి నష్టం కలిగించే రీతిలో ఉన్నందున పార్టీ అధిష్టానం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నది.

పార్టీ అధ్యక్షులు శ్రీ కె. చంద్రశేఖర్ రావు గారు శ్రీమతి కె. కవిత ను తక్షణం పార్టీ నుండి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

సోమ భరత్ కుమార్
ప్రధాన కార్యదర్శి
పార్టీ క్రమశిక్షణ వ్యవహారాల బాధ్యులు

టి. రవీందర్ రావు
ప్రధాన కార్యదర్శి

## చిప్ తయారీలో భారత్ సంచలనం

**- అంతరిక్ష ప్రయోగాల కోసం విక్రమ్ చిప్ రూపకల్పన**






**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారతదేశం సెమికండక్టర్ రంగంలో ఒక చారిత్రాత్మక మైలురాయిని అందుకుంది. దేశంలో మొట్టమొదటి స్వదేశీ 32-బిట్ మైక్రోప్రాసెసర్ 'విక్రమ్'ను సెమికాన్ ఇండియా 2025 సదస్సులో ఆవిష్కరించింది. ఈ చిప్‌ను ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్వినీ వైష్ణవ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అందించారు. ఇది భారతదేశం సెమికండక్టర్ రంగంలోఒక ముఖ్యమైన అడుగు. ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) కు చెందిన సెమీ-కండక్టర్ లాబొరేటరీ (ఎస్సీఎల్) ద్వారా అభివృద్ధి చేశారు. ఈ చిప్, అంతరిక్ష ప్రయోగ వాహనాల కఠిన పరిస్థితులను తట్టుకునేలా రూపొందించారు. విక్రమ్ 3201, ఇస్రో విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్సీ),

2లో..

## పక్కకు జరిగితే చాలు..

## కుర్చీలో కూర్చోడానికి కొందరు సిద్ధంగా ఉన్నారు

**- 'వైఎస్ఆర్ స్మారక పురస్కారం-2025'లో సీఎం రేవంత్ రెడ్డి**

**- ఈ తరానికి ఒకే వైఎస్సార్, ఒకే కేవీపీ**

**- వైఎస్ ఆశయాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తుందన్న రేవంత్ రెడ్డి**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కుర్చీ నుంచి కొంచెం పక్కకు జరిగితే చాలు, ఆ స్థానంలో కూర్చొని నడిపించడానికి కొందరు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. తాను అనుభవంతో ఇవి చెబుతున్నానని అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని హొటల్ దసపల్లాలో నిర్వహించిన 'వైఎస్ఆర్ స్మారక పురస్కారం-2025' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వైఎస్ రాజశేఖర రెడ్డి, కేవీపీ మధ్య ఉన్న అనుబంధం గురించి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు. కొందరు మేం అన్నీ చూసుకుంటామని చెబుతుంటారని, కానీ ఈ తరానికి ఒకే వైఎస్సార్, ఒకే కేవీపీ ఉంటారని రేవంత్ రెడ్డి అన్నారు. మిత్రుడు వైఎస్ కోసం కేవీపీ సర్వం ధారపోశారని అన్నారు.కేవీపీ ఎప్పుడూ వైఎస్ వెంటే ఉన్నారని అన్నారు. కానీ ఈనాడు చాలామంది కేవీపీ కావాలని అనుకుంటారని, కానీ అలా ఎవరూ కాలేరని అన్నారు. ఒక కేవీపీ కావాలంటే సర్వం త్యాగం చేయగలగాలని ముఖ్యమంత్రి అన్నారు. ఈరోజుల్లో అలాంటి గుణం ఉన్నవారు

2లో..

## టీడీపీకి ఆ ధైర్యం లేదు

**- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని జగన్ ఆగ్రహం**




అమరావతి (ప్రశ్న న్యూస్) కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ విమర్శించారు. పోలీసులను అడ్డుపెట్టుకుని దౌర్జన్యాలకు పాల్పడుతూ, ప్రజల ఓటు హక్కును కూడా కాలరాస్తున్నారని ఆయన మండిపడ్డారు. కడప జిల్లా నల్లపురెడ్డిపల్లెలో పర్యటించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా, ఇటీవల జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో అధికార టీడీపీ నేతలు అరాచకాలకు పాల్పడ్డారంటూ పలువురు గ్రామస్థులు ఆయన వద్ద తమ ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఓటర్లపై కుట్రలు పన్నుతోందని

2లో..

## ఏపీలో పోర్టు ఆధారిత ఎకానమీ

### త్వరలో లాజిస్టిక్ కార్పొరేషన్

**అమరావతి (ప్రశ్న న్యూస్)** తూర్పు తీర మారిటైమ్ లాజిస్టిక్స్ గేట్ వేగా ఏపీ మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశ్వాసం వ్యక్తం చేశారు. ఉత్తరాది రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన తెలంగాణా, మహారాష్ట్ర, చత్తీస్ ఘడ్, కర్ణాటక తదితర రాష్ట్రాల హింటర్ ల్యాండ్ కార్గోను కూడా ఏపీ పోర్టుల ద్వారా రవాణా చేసేలా కార్యాచరణ చేపడుతున్నామన్నారు. వివరించారు. మంగళవారం విశాఖలో జీఎఫ్ఎస్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈస్ట్ కోస్ట్ మారిటైమ్ లాజిస్టిక్స్ సమ్మిట్ కు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

### రోడ్డు, రైలు కనెక్టివిటి, ఓడరేవుల్లో టెర్మినల్ల ఆధునీకరణ

ఏపీని లాజిస్టిక్స్ హబ్ గా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ చేపడుతున్నామ ఈస్ట్ కోస్టు గేట్ వేగా ఏపీ అత్యుత్తమ ప్రదేశమని అన్నారు. సదస్సు కంటే ముందు మారిటైమ్ లాజిస్టిక్స్ అభివృద్ధిపై దేశవ్యాప్తంగా వివిధ పోర్టులు, కార్గో హ్యాండ్లింగ్ కంపెనీలకు చెందిన 62 మంది సీఈఓలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. రాష్ట్రంలో మారిటైమ్ లాజిస్టిక్స్ రంగంలో ఉన్న అవకాశాలు,

2లో..



## వరద సాయం @ రూ.200 కోట్లు

**- తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాష్ట్రంలోని చాలా ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇళ్లు, రోడ్లు, భవనాలకు నష్టం వాటిల్లింది. అదే సమయంలో చాలా చెరువులు, కుంటలు తెగిపోయాయి. భారీ వానలకు తెలంగాణ రాష్ట్రం అతలాకుతలం అయింది. ఈ క్రమంలోనే తెలంగాణ ప్రభుత్వం వరదలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా

2లో..

## పార్టీలో ఉంటే ఎంత.. పోతే ఎంత

**- కవితకు బీఆర్ఎస్ మహిళా నేతల స్ట్రాంగ్ కౌంటర్**

**- కేసీఆర్ కు కన్నపేగు కంటే పార్టీ ప్రయోజనాలే ముఖ్యమన్న సత్యవతి రాథోడ్**

**- ముందుగా హెచ్చరించినా కవిత తీరు మారలేదని వ్యాఖ్య**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ పార్టీ ఉంటే ఎంత లేకపోతే ఎంత అని మాట్లాడిన కవితపై బీఆర్ఎస్ మహిళా నేతలు ఫైరయ్యారు.పార్టీలో కవిత ఉంటే ఎంత లేకపోతే ఎంత అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ కీలక మహిళా నేతలు తెలంగాణ భవన్ లో మీడియా సమావేశం నిర్వహించి కవితపై విరుచుకుపడ్డారు. గత మూడు నెలలుగా కవిత మాట్లాడుతున్న మాటలు చూశామమని పార్టీ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ప్రకటించారు. మూడు నెలలుగా కవిత తన తీరుతో పార్టీ కి ఎంతో నష్టం చేశారు, బీఆర్ఎస్ శ్రేణులను కవిత బాధకు గురి చేశారన్నారు. ఈ రోజు

2లో..

## కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే ప్రసక్తే లేదు

### టీపీసీసీ మహేశ్ కుమార్ గౌడ్ సంచల వ్యాఖ్యలు

**- ఆమె సస్పెన్షన్ బీఆర్ఎస్ అంతర్గత వ్యవహారమని వ్యాఖ్య**

**- అవినీతి సొమ్ము పంపకాలలో తేడాతోనే కవిత వ్యాఖ్యలు చేశారన్న టీపీసీసీ చీఫ్**

**- పదేళ్ల బీఆర్ఎస్ పాలన అవినీతిని ఆమె బయటపెట్టాలని డిమాండ్**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఎమ్మెల్సీ కవితను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడంపై తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే ప్రసక్తే లేదని, ఆమె అవసరం తమ పార్టీకి ఏమాత్రం లేదని తేల్చి చెప్పారు. కవితను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడం పూర్తిగా ఆ పార్టీ

2లో..



## ఎటుచూసినా అమరావతి ఆకర్షణీయంగా ఉండాలి

**- సీఆర్డీఏకి చంద్రబాబు దిశానిర్దేశం**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. రాజధానిలో చేపట్టాల్సిన ప్రధాన ప్రాజెక్టులను సకాలంలో,

2లో..

## తెలంగాణలోకి సీబీఐ ఎంట్రీ

**- కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు లైన్ క్లియర్**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలపై సీబీఐ విచారణ జరిపించాలని తెలంగాణ ప్రభుత్వం సిఫారసు చేసింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నివేదిక ఆధారంగా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. ఎన్డీఎస్ఏ తన నివేదికలో కాళేశ్వరం ప్రాజెక్టు ప్లాన్, డిజైన్, నిర్మాణ నాణ్యతలో లోపాలు ఉన్నట్లు వెల్లడించినట్లు తెలంగాణ ప్రభుత్వం ఆ లేఖలో తెలిపింది. అలాగే, జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని మిషన్ కూడా విచారణ జరిపి అనేక లోపాలను గుర్తించినట్టు స్పష్టం చేసింది. కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చ జరిగిన విషయాన్ని కూడా లేఖలో ప్రస్తావించారు. గతంలో రాష్ట్రానికి సీబీఐ రాకుండా ఉన్న పరిమితులను తొలగిస్తూ

2లో..

## ఆఫ్ఘనిస్థాన్ భూకంపంలో మృతుల సంఖ్య @1,411

**3,100 మందికి పైగా గాయాలు, 5400 ఇళ్లు నేలమట్టం**

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆఫ్ఘనిస్థాన్‌లో ప్రకృతి సృష్టించిన ప్రళయానికి భారీ సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు.

2లో..



## కీలక నిర్ణయం దిశగా కవిత అడుగులు

**- ఎమ్మెల్సీ పదవికీ రాజీనామా.?**

2లో..



# బీఆర్ఎస్ నుంచి కవిత సస్పెన్షన్

కేసీఆర్‌కు నమ్మిన బంటుగా ఉన్న నేతలపై విరుచుకుపడ్డారు.

### హరీష్ రావుపైనే సంచలన వ్యాఖ్యలు, ఆరోపణలా..

ఇన్నాళ్లు పార్టీలో కీలక నేతల పేర్లు ప్రస్తావించని కవిత, తాజాగా మాజీ మంత్రి, కేసీఆర్ మేనల్లుడు, పార్టీలో నెంబర్ త్రీగా చెప్పుకునే హరీష్ రావుపై మీడియా ముందు పేరు ప్రస్తావిస్తూ సంచలన ఆరోపణలు చేశారు. కాలేశ్వరం అవినీతిలో హరీష్ రావు పాత్ర లేదా అంటూనే, సంతోష్, హరీష్ రావు కలసి, తన తండ్రి కేసీఆర్ ను తప్పుదోవ పట్టించారని, వారివల్లనే కాలేశ్వరంలో అవినీతి మరకలు కేసీఆర్ కు అంటుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి స్వార్థం కోసమే కేసీఆర్ ను బలిచేశారని ఆరోపించడం తెలంగాణ రాజకీయాల్లో పొలిటికల్ సునామీని సృష్టించారు. అంతేకాదు మరో అడుగు ముందుకేసి బిఆర్ ఎస్ పార్టీ ఉంటే ఎంత పోతే ఎంత అంటూ పార్టీ పరువు గంగలో కలిపినంత పనిచేశారు కవిత..

### పార్టీ నేతల అభిప్రాయంతో ఏకీభవించిన కేసీఆర్.. కవితపై వేటు

కవిత వ్యాఖ్యల తరువాత బీఆర్ఎస్ లో పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. ఇన్నాళ్లు భరించింది చాలు. కేసీఆర్ కూతురు కాబట్టే ఓపిక పట్టాం. ఇంక పంపేద్దాం పార్టీ నుండి. ఆమె మాకొద్దు మహా ప్రభో అంటూ తీవ్ర స్థాయిలో పార్టీ కేడర్ నుండి, ముఖ్య నేతల నుండి కేసీఆర్ పై ఒత్తిడి పెరిగింది. మరోవైపు మీడియా సైతం కేసీఆర్ కూతురు కాబట్టే చర్యలు తీసుకోవడంలేదుంటూ ఉతికి ఆరేస్తోంది. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన కేసీఆర్ ముఖ్యనేతలతో చర్చించి , ఓ క్లారిటీ వచ్చినట్లుగా సమాచారం. కవితను పార్టీ నుండి సస్పెండ్ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కూతురు కదా అని ఊరుకుంటే, ఇన్నాళ్లు కాపాడుకున్న పార్టీకి భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉందని భావించిన , పార్టీ కంటే కూతురేం ఎక్కువ కాదనే నిర్ణయానికి కేసీఆర్ వచ్చారు.

# చిప్ తయారీలో భారత్ సంచలనం

చండీగఢ్‌లోని ఎస్సీఎల్ సహకారంతో అభివృద్ధి చేసిన మొట్టమొదటి పూర్తి స్వదేశీ 32-బిట్ మైక్రోప్రాసెసర్. ఈ చిప్ 180 నానోమీటర్ సీమోస్ టెక్నాలజీని ఉపయోగించి తయారు చేశారు. -55ళీ%జ% నుంచి ం125ళీ%జ% వరకు ఉష్ణోగ్రతలను తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంది. ఇది అంతరిక్ష ప్రయోగాలకు అనువైనది. అంతరిక్ష వాహనాల ట్రాజెక్టరీ గణనలు , సెన్సార్ డేటా విశ్లేషణల కోసం అవసరమైన ఖచ్చితమైన గణనలను అందిస్తుంది. ఏడీఏ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ సపోర్ట్ ఇస్తుంది. ఏరోస్పేస్ సిస్టమ్స్‌లో ఉపయోగించే ఈ భాష, సురక్షితమైన , నమ్మదగిన అప్లికేషన్‌లకు అనుకూలం. రాకెట్‌లలో ఇతర ఎవియానిక్స్ మాడ్యూల్స్‌తో సజావుగా కమ్యూనికేషన్‌ను సులభతరం చేస్తుంది. ఇస్రో అభివృద్ధి చేసిన కంపైలర్స్, అసెంబ్లర్స్, సిమ్యులేటర్స్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఎన్విరాన్‌మెంట్ (ఐడీఈ) వంటి సాధనాలు, ఓపెన్-సోర్స్ టూల్‌చైన్‌లతో పాటు అందుబాటులో ఉన్నాయి. విక్రమ్ 3201 చిప్, 2024లో పీఎస్ఎల్వీ -సీ60 మిషన్‌లోని పీఎస్ఎల్వీ ఆర్బిటల్ ఎక్స్‌పెరిమెంటల్ మాడ్యూల్ (పీఓఈఎం-4)లో విజయవంతంగా పరీక్షించారు.దీని ద్వారా అంతరిక్షంలో దాని నమ్మకమైన పనితీరు చూపించగలిగారు. సెమికాన్ ఇండియా 2025, న్యూ ఢిల్లీలో సెప్టెంబర్ 2న ప్రారంభమైంది. మూడు రోజుల సదస్సు, 48 దేశాల నుంచి 20,750 మందికి పైగా పాల్గొంటున్నారు. భారతదేశాన్ని గ్లోబల్ చిప్ డిజైన్ , తయారీ హబ్‌గా స్థాపించడానికి లక్ష్యంగా దీన్ని నిర్వహిస్తున్నారు. "నూనె బ్లాక్ గోల్డ్ అయితే, సెమికండక్టర్ చిప్స్ డిజిటల్ డైమండ్స్" అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. 2021లో ప్రారంభించిన ఇండియా సెమికండక్టర్ మిషన్ (ఐఎస్ఎం) ద్వారా గత 3.5 సంవత్సరాల్లో కీలక విజయాలు సాధించింది.

# ఏపీలో పోర్టు ఆధారిత ఎకానమీ

పోర్టు కార్గో హ్యాండ్లిగ్ లో మౌలిక సదుపాయాల కల్పన, రోడ్డు, రైలు కనెక్టివిటి, ఓడరేవుల్లో టెర్మినళ్ల ఆధునీకరణ, షిప్ బిల్డింగ్, మారిటైమ్ లాజిస్టిక్స్ లో అంతర్జాతీయంగా అనుసరిస్తున్న ప్రమాణాలతో పాటు వివిధ అంశాలను ప్రతిపాదించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని వివిధ పోర్టుల ద్వారా 69 మిలియన్ టన్నుల మేర ఇనుప ఖనిజం, 11 మిలియన్ టన్నుల బొగ్గు, 5.5 మిలియన్ టన్నుల ఎరువుల రవాణా జరుగుతోందని సీఎం తెలిపారు. బల్క్ కార్గో రవాణాకు భారీ నౌకలు రాకపోకలు సాగించేలా 18 మీటర్ల లోతైన ఓడరేవులు తూర్పుతీరంలో ఏపీ మినహా మరెక్కడా లేవన్నారు.

### త్వరలో లాజిస్టిక్ కార్పొరేషన్

సముద్ర రవాణా పరంగా ఏపీ దేశంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. పోర్టులకు అనుసంధానంగా మూడు పారిశ్రామిక కారిడార్లు కూడా ఏపీలో ఉన్నాయని తెలిపారు. పొరుగు రాష్ట్రం తెలంగాణా డ్రైపోర్టును ఏర్పాటు చేసి మచిలీపట్నం ద్వారా కార్గో రవాణా చేయాలని భావిస్తోందని అన్నారు. గోదావరి నది ద్వారా అంతర్గత జల రవాణా మార్గాలతో మహారాష్ట్ర, కర్ణాటక కూడా ఏపీలోని కొన్ని పోర్టుల ద్వారా సరకు రవాణా చేయాలని భావిస్తున్నట్టు సీఎం స్పష్టం చేశారు. ఇవన్నీ ఏపీకి ఉన్న సానుకూలతలని తెలిపారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రహదారులు, రైలు మార్గాలను అనుసంధానించి ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ వ్యవస్థను రూపొందిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వీటితో పాటు అంతర్గత జలరవాణా మార్గాలను కూడా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఆపరేషనల్ గా ఉన్న పోర్టులు, కొత్తగా అందుబాటులోకి రానున్న పోర్టులతో రహదారులు, రైలు మార్గాలు, అంతర్గత జలరవాణా, ఎయిర్ కార్గో మార్గాలను అనుసంధానించేలా ప్రతీ పోర్టుకూ కనెక్టివిటీ మాస్టర్ ప్లాన్ రూపోందిస్తామని సీఎం వెల్లడించారు. రవాణా పరమైన అంశాలను నిర్వహించేందుకు వీలుగా ఏపీలో త్వరలోనే లాజిస్టిక్స్ కార్పోరేషన్ ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### పోర్టులకు అనుబంధంగా పరిశ్రమలు, టౌన్ షిప్‌లు

పోర్టులకు అనుసంధానంగా పారిశ్రామిక కార్యకలాపాలతో పాటు టౌన్ షిప్ లను కూడా ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపోందిస్తున్నామని సీఎం వివరించారు. మూలపేట, మచిలీపట్నం, కాకినాడ, రామాయపట్నం ఇలా వివిధ పోర్టుల వద్ద పరిశ్రమల ఏర్పాటు, టౌన్ షిప్ ల కోసం 10 వేల ఎకరాల భూమి కూడా అందుబాటులో ఉందన్నారు. ఆర్థిక వ్యవస్థతో పాటు ఈ రంగాల్లో నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలు మెరుగయ్యేలా లాజిస్టిక్స్ యూనివర్సిటీ, సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీలు కూడా త్వరలో ఏర్పాటు అవుతాయని సీఎం తెలిపారు. విశాఖ, అమరావతి, తిరుపతి సహా రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి ఎయిర్ కార్గో రవాణాకు కూడా అనువుగా ఏర్పాట్లు చేస్తామన్నారు. మొత్తంగా జీఎస్టీపీలో లాజిస్టిక్స్ రంగం 3 శాతానికి పెంచుకునేందుకు అవకాశం ఉందన్నారు. దుగరాజపట్నం సహా వివిధ ప్రాంతాల్లో షిప్ బిల్డింగ్ యూనిట్లు, మరమ్మత్తులు, కంటైనర్లు, షిప్ రీసైక్లింగ్ లాంటి పరిశ్రమల ఏర్పాటుకు అవకాశముందని సీఎం స్పష్టం చేశారు.మారిటైమ్ లాజిస్టిక్స్ కు సంబంధించి 15-20 మంది పారిశ్రామిక వేత్తలతో కూడిన సలహా బోర్డును కూడా ఏర్పాటు చేయనున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. అంతకు ముందు మారిటైమ్ రంగంలోని ఆరు స్టార్టప్ కంపెనీలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించారు. ఎయిర్ కార్గో ఫోరం ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్ ను సీఎం ఆవిష్కరించారు.

# పార్టీలో ఉంటే ఎంత.. పోతే ఎంత

కవితను సస్పెండ్ చేస్తూ తీసుకున్న నిర్ణయం అందరినీ ముఖ్యంగా మహిళలను సంతోష పరిచిందన్నారు. పేగు బంధం కన్నా తనను నమ్ముకున్న కోట్లాది ప్రజలే ముఖ్యమని కేసీఆర్ నిరూపించారని కార్యకర్తల కన్నా కుటుంబ సభ్యులు ఎక్కువ కాదని కేసీఆర్ నిరూపించారన్నారు. కవిత కు నచ్చ చెప్పాలని చూసినా ఆమె వినలేదు కనుకే కేసీఆర్ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. పార్టీ తర్వాతే ఎవరైనా అని కేసీఆర్ సందేశం ఇచ్చారని, కేసీఆర్ మళ్ళీ రావాలని ప్రజలు కోరుకుంటున్న తరుణం లో కవిత పార్టీని ఇబ్బంది పెట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ శ్రేణులను కవిత తన మాటలతో గాయపరిచారని విమర్శించారు. హరీష్ రావు ,కేటీఆర్ లు కేసీఆర్ కు కుడి ఎడమ భుజాల్లాంటి వారని వారిద్దరిపై కవిత నిరాధార ఆరోపణలు చేశారన్నారు. పీసీ ఘోష్ కమిషన్ కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేదు, అసెంబ్లీ లో హరీష్ రావు ఒంటి చేత్తో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎదుర్కొన్నారన్నారు.

బీఆర్ఎస్ శ్రేణులు హరీష్ రావు ప్రసంగాన్ని ఆస్వాదిస్తుంటే కవిత విమర్శించడం ఆమె ఏ లైన్లో ఉన్నారో రుజువు చేస్తోందని కేసీఆర్ కుమార్తె గా కవిత ఎక్కడికి వచ్చినా ప్రజలు స్వాగతం పలికారు కానీ ఆ గౌరవాన్ని కవిత నిలుపుకోక పోయారన్నారు. పార్టీ ఉంటె ఎంత పోతే ఎంత అని కవిత మాట్లాడొచ్చా.? పార్టీలో కవిత ఉంటె ఎంత లేకపోతే ఎంత అని ఆమె కు కేడర్ బదులిచ్చిందన్నారు. కవితనే కేసీఆర్ కు మచ్చ తెచ్చిందని ప్రజలు భావించారని కేసీఆర్ నేడు తీసుకున్న నిర్ణయం గొప్పదని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. కేసీఆర్ తన ప్రాణాన్ని ఫణంగా పెట్టి తెలంగాణ సాధించారు, తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత ప్రజలే తన బాస్ లు అని కేసీఆర్ ప్రకటించారని గుర్తు చేశారు.

పార్టీ రజతోత్సవ వేడుకల్లో కేసీఆర్ తన ప్రసంగం లో సీఎం రేవంత్ రెడ్డి పేరు తీసుకోలేదని దీన్ని సీఎం రేవంత్ రెడ్డి ఓర్చుకోలేక పోయారన్నారు. అందరికీ ఆ సభ నచ్చితే కవిత కు మాత్రం నచ్చలేదని పార్టీ ఉంటె ఎంత లేకుంటే ఎంత అని మాట్లాడావ్ క్షేత్ర స్థాయిలో ఎంత ఆగ్రహం ఉందో కవిత కు తెలుసా అని ప్రశఅనించారు. కవిత కేసీఆర్ ను ఏమని పిలుస్తుందో తెలియదు కానీ తెలంగాణ ప్రజలు కేసీఆర్ ను బాపు అంటారని, కవిత తనకు తానే గొయ్యి తవ్వుకున్నారని, కవిత భుజం మీద తుపాకీ పెట్టి ఎవరో కాలుస్తున్నారు కాలగమనం లో అన్ని విషయాలు బయటకు వస్తాయని ప్రకటించారు. కవిత పార్టీ పెడుతుందా పెట్టదా మాకు సంబంధం లేదని బీఆర్ఎస్ నుంచి దూరమై పార్టీ పెట్టిన వాళ్ళు ఎవ్వరూ బాగుపడలేదన్నారు.

# వరద సాయం @ రూ.200 కోట్లు

ఉన్న అన్ని జిల్లాలకు తక్షణ వరద సాయం కింద నిధులను మంజూరు చేసింది. ఇప్పటికిప్పుడు అత్యవసర సాయం కింద రూ.200 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇందులో భారీగా దెబ్బతిన్న జిల్లాలకు ఎక్కువగానూ తక్కువ నష్టం వచ్చిన జిల్లాలకు తక్కువగానూ నిధులు కేటాయించారు.గత కొన్ని రోజులుగా కురిసిన భారీ వర్షాలు, వరదలతో భారీగా నష్టాన్ని చవిచూసిన 7 జిల్లాలకు ఒక్కో జిల్లాకు రూ.10 కోట్ల చొప్పున నిధులను మంజూరు చేసింది. అదే సమయంలో కొంత తక్కువగా నష్టపోయిన మిగిలిన 26 జిల్లాలకు ఒక్కో జిల్లాకు రూ.5 కోట్ల చొప్పున నిధులను మంజూరు చేసినట్లు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. ఇక ఇప్పటికే కామారెడ్డి, ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం రోజున వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వర్షాల నష్టంపై చర్చించారు. వరదలకు భారీగా ప్రభావితమైన ప్రాంతాల్లో వేగంగా సహాయక చర్యలను చేపట్టాలని వరద పరిహారాలను తక్షణమే విడుదల చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. భవిష్యత్తులో రానున్న మరిన్ని అకాల వర్షాలు, వరదలతో ప్రభావితం అయ్యే జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు అలర్ట్‌గా ఉండాలని ఆదేశాలు జారీ ఇచ్చారు.మరోవైపు భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న రోడ్లు, భవనాలు, చెరువులు, కుంటలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు విద్యుత్ సబ్ స్టేషన్ల పునర్నిర్మాణం పనులను వేగవంతం చేయాలని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర విపత్తు ఉపశమన నిధులు ఉన్నప్పటికీ.. నిబంధనల ప్రకారం వాటిని ఖర్చు చేయడంలో అలసత్వం చూపడంపై అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు, పశువులు కోల్పోయిన కుటుంబాలకు వెంటనే పరిహారం విడుదల చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని అధికారుల బృందం ఈనెల 4వ తేదీన ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి నివేదికలకు అందజేయనున్నట్లు చెప్పారు. ఇక రాష్ట్రంలో వర్షాలు, వరదల కారణంగా 257 చెరువులు, కుంటలకు గండి పడినట్లు అధికారులు సీఎంకు వివరించారు. ఇక రాష్ట్రంలోని 82 మండలాల్లో 2.36 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా రూపొందించారు. దీనిపై స్పందించిన సీఎం పూర్తి వివరాలతో సమగ్ర నివేదిక ఇస్తే కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. వరదలో మునిగిన సబ్ స్టేషన్ల స్థానంలో అధునాతన సామగ్రి, సామర్థ్యంతో కూడిన సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శిని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. పురపాలక, పంచాయతీరాజ్, జీహెచ్ఎంసీ పరిధిలో స్ట్రీట్ లైట్ల ఏర్పాటు, నిర్వహణపై సమీక్ష నిర్వహించి పరిష్కారాలు సూచించాలని సీఎస్ రామకృష్ణారావుకు సూచించారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా, పశు సంవర్ధక శాఖలు కూడా 2 రోజుల్లో సమగ్ర నివేదికలు రూపొందించాలని ఆదేశించారు.

# ఎటుచూసినా అమరావతి ఆకర్షణీయంగా ఉండాలి

పూర్తిచేయడమే లక్ష్యంగా ఒక ప్రత్యేక యంత్రాంగాన్ని (స్పెషల్ పర్పస్ వెహికల్ - ఎస్పీవీ) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన 52వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఈ మేరకు ఆమోదముద్ర వేశారు. మొత్తం 7 కీలక అంశాలపై ఈ సమావేశంలో చర్చించి, అంగీకారం తెలిపారు. రాజధాని అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలను కార్యాచరణలోకి తీసుకురావాలని ఈ సందర్భంగా సీఎం అధికారులను ఆదేశించారు. ఎటుచూసినా అమరావతి నగరం ఆకర్షణీయంగా కనిపించాలని దిశానిర్దేశం చేశారు.

### ఎస్పీవీ పరిధిలోకి కీలక ప్రాజెక్టులు

రాజధాని అమరావతికి తలమానికంగా నిలవనున్న అనేక కీలక ప్రాజెక్టుల బాధ్యతను ఇకపై ఈ ఎస్పీవీ పర్యవేక్షించనుంది. గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం, ఐకానిక్ వంతెన, ఎన్టీఆర్ విగ్రహం, స్మార్ట్ ఇండస్ట్రీస్, స్పోర్ట్స్ సిటీ, ఇన్నర్ రింగ్ రోడ్డు, కృష్ణా నది రివర్ ఫ్రంట్, రోప్ వే వంటి భారీ నిర్మాణాల ప్రణాళిక, నిధుల సమీకరణ, అమలు, నిర్వహణ బాధ్యతలను ఈ ప్రత్యేక సంస్థే చూసుకుంటుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకుని, అత్యంత ప్రాధాన్యత కలిగిన 'బయో డిజైన్ ప్రాజెక్టు'ను కూడా ఎస్పీవీ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. అమరావతిలో స్పోర్ట్స్ సిటీ తరహాలోనే ఒక 'హెల్త్ సిటీ'ని కూడా అభివృద్ధి చేయనున్నామని, అందులో భాగంగానే ఈ బయో డిజైన్ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటుందని ఆయన వెల్లడించారు. ప్రజారోగ్య సేవల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చే ఈ ప్రాజెక్టులో భాగస్వాములయ్యేందుకు అమెరికా, సింగపూర్ సహా ఏడు దేశాలకు చెందిన నిపుణులు, సంస్థలు ఇప్పటికే సంసిద్ధత వ్యక్తం చేశాయని సీఎం తెలిపారు.

### మౌలిక వసతుల కల్పనకు గ్రీన్ సిగ్నల్

అమరావతిలో పరిపాలన భవనాల సముదాయం (గవర్నమెంట్ కాంప్లెక్స్) నిర్మాణానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన పనులకు సంబంధించిన టెండర్లకు కూడా సీఆర్డీఏ అథార్టీ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా మొత్తం 53.68 కిలోమీటర్ల మేర అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన రహదారులతో పాటు ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టనున్నారు. కేవలం నిర్మాణం మాత్రమే కాకుండా, ఏడేళ్ల పాటు ఆ రహదారుల నిర్వహణ బాధ్యతను కూడా టెండర్ దక్కించుకున్న సంస్థే చూసుకునేలా నిబంధనలు చేర్చినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

### ప్రతి నిర్మాణం ఒక అద్భుతంలా ఉండాలి

రాజధాని ప్రాంతంలో చేపట్టే ప్రతి నిర్మాణం ప్రజలను ఆకట్టుకునేలా, ఒక అద్భుతంలా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. అర్బన్ డిజైన్లు, ఆర్కిటెక్చరల్ మార్గదర్శకాలకు సంబంధించిన నోటిఫికేషన్ జారీకి అథారిటీ ఆమోదం తెలిపిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డిజైన్ల ఆమోదం విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, నగరం మొత్తం ఒక ప్రత్యేక ఆకర్షణతో కనిపించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మరోవైపు, సీఆర్డీఏ పరిధిలో కార్యకలాపాలు పెరిగిన నేపథ్యంలో అవసరమైన సిబ్బందిని డిప్యుటేషన్ లేదా ఆన్-డ్యూటీ పద్ధతిలో నియమించుకునేందుకు సీఎం అనుమతినిచ్చారు.

రాజధానిలో ప్రపంచస్థాయి కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి కొన్ని ప్రముఖ హొటల్ సంస్థలు ముందుకొచ్చాయని అధికారులు తెలపగా, వాటికి భూములు కేటాయించేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారు. అయితే నిర్మాణాలు అంతర్జాతీయ ప్రమాణాలకు ఏమాత్రం తగ్గకుండా ఉండాలని స్పష్టం చేశారు. మాస్టర్ ప్లాన్ అవసరాల నిమిత్తం ఏమైనా భూసేకరణ చేయాల్సి వస్తే, రైతులతో స్నేహపూర్వకంగా చర్చించి, వారికి ఎలాంటి నష్టం కలగకుండా ప్రక్రియ పూర్తిచేయాలని సీఎం తేల్చిచెప్పారు. కృష్ణా నదిపై నిర్మించ తలపెట్టిన ఐకానిక్ వంతెన డిజైన్లపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నదిలోని లంక భూములను (ద్వీపాలను) అభివృద్ధి చేసి, పర్యాటకులను ఆకర్షించే కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, పురపాలక, సీఆర్డీఏ, ఏడీసీ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పక్కకు జరిగితే చాలు..

## కుర్చీలో కూర్చోడానికి కొందరు సిద్ధంగా ఉన్నారు

ఎవరూ లేరని అన్నారు. మొదటి వారం మనం ఎవరినైనా లోపలకు రానిస్తే, రెండో వారంలో కాస్త పక్కకు జరిగితే ఆ కుర్చీలో కూర్చుని నడుపుతానని చెప్పేవారు ఉన్నారని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి ఇంకా మాట్లాడుతూ, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తుందని అన్నారు. వైఎస్ఆర్ కలలు కన్న ప్రాజెక్టును పూర్తిచేసి తీరుతామని పునరుద్ఘాటించారు. "తుమ్మిడిహట్టి వద్ద మళ్లీ ప్రాజెక్టును నిర్మించి, రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, వికారాబాద్, పరిగి, తాండూర్, కొడంగల్ ప్రాంతాలకు గోదావరి జలాలను తీసుకువస్తాము. ఇది రాజశేఖర్ రెడ్డి ఆశయాలను కొనసాగించే ప్రభుత్వంగా నేను ఇస్తున్న మాట" అని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి హర్యానా మాజీ ముఖ్యమంత్రి భూపేంద్ర సింగ్ హుడా, తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, మాజీ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి తదితర కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు హాజరయ్యారు. దివంగత నేత వైఎస్ఆర్‌కు నివాళులు అర్పించి, ఆయన సేవలను స్మరించుకున్నారు.

## వైయస్ఆర్‌కు నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

భద్రాచలం, : డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా చర్ల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నివాళి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రెటరీ నల్లపు దుర్గా ప్రసాద్ తో పాటు చర్ల కాంగ్రెస్ నాయకులు గుండెపుడి భాస్కరరావు, ఎస్సి సెల్ మండల ప్రెసిడెంట్ సల్మాన్ రాజ్, విజయ్ నాయుడు, సత్తిబాబు, మాజీ ఎంపీటీసీ మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు మడకం పద్మ, ఇర్ప అంజి బాబు, మేడి రమేష్, మైపా జోగారావు, చింతయ్య, మండల మరియు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణలోకి సీబీఐ ఎంట్రీ

తెలంగాణ ప్రభుత్వం ఒక జీవోను విడుదల చేసింది. 2022లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలోకి సీబీఐ అనుమతిని నిరాకరించింది. రాష్ట్రంలోకి సీబీఐ రాకుండా జీవో 51 జారీ చేసింది. దీంతో సీబీఐ అధికారులు ఏదైనా కేసు దర్యాప్తు చేపట్టాలంటే మొదట ప్రభుత్వం అందుకు అనుమతి తీసుకోవాల్సి వచ్చేది. గత బీఆర్ఎస్ సర్కార్ తెచ్చిన జీవోను ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం సవరించింది. జీవో 51ను సవరించి తెలంగాణలోకి సీబీఐ రాక రూట్ క్లియర్ చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు దర్యాప్తును సీబీఐకి అప్పటించింది తెలంగాణ ప్రభుత్వం.

### హైకోర్టులో తెలంగాణ అడ్వకేట్ జనరల్ కీలక వ్యాఖ్యలు

కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ సందర్భంగా, తెలంగాణ అడ్వకేట్ జనరల్ (ఏజీ) నేడు హైకోర్టులో టెక్నికల్‌గా సమాధానమిచ్చారు. సీబీఐ దర్యాప్తును పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా కాకుండా, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ ) నివేదిక మరియు విజిలెన్స్ రిపోర్టులను బేస్‌గా తీసుకుని కోరినట్లు స్పష్టం చేశారు. మరోవైపు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మరియు మాజీ మంత్రి హరీష్ రావును లక్ష్యంగా చేసుకుని, పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని వారి న్యాయవాదులు కోర్టును కోరారు. ఈ నేపథ్యంలో, ప్రభుత్వ తరపున అడ్వకేట్ జనరల్ మరోసారి కోర్టుకు స్పష్టంచేశారు ు సీబీఐ దర్యాప్తు పీసీ ఘోష్ నివేదికను బేస్ చేసుకుని కాదు, ఎన్డీఎస్ఏ నివేదిక ఆధారంగా కోరినదేనని. అంతేకాదు, పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా కేసీఆర్, హరీష్ రావుపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# కీలక నిర్ణయం దిశగా కవిత అడుగులు

## - ఎమ్మెల్సీ పదవికీ రాజీనామా.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేసీఆర్ కుమార్తె, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇక స్వతంత్రంగా రాజకీయాలు చేయాలని నిర్ణయించుకున్నారు. పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ కేసీఆర్ నిర్ణయం తీసుకోవడంతో ఆ పార్టీ ద్వారా వచ్చిన పదవులన్నింటినీ వదులుకోవాలని డిసైడయ్యారు. అందులో భాగంగా ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేయాలని అనుకుంటున్నారు. నేడు తన నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉంది.

### నిజామాబాద్ స్థానిక సంస్థల నుంచి ఏకగ్రీవంగా గెలిచిన కవిత

కవిత ప్రస్తుతం నిజామాబాద్ స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా ఉన్నారు. కవిత పదవీ కాలం 2028 జనవరి నాలుగో తేదీ వరకూ ఉంది. రెండేళ్ల మూడు నెలల వరకూ పదవీ కాలం ఉంది. కవిత రాజీనామా చేస్తే ఉపఎన్నికలు ఖాయంగా జరుగుతాయని అనుకోవచ్చు. 2022లో జరిగిన నిజామాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో కవిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అప్పట్లో బీఆర్ఎస్ పార్టీకి తిరుగులేని బలం ఉండటంతో పోటీకి ఎవరూ నిలబడలేకపోయారు. అంతకు ముందు అదే స్థానానికి 2020లో జరిగిన ఉపఎన్నికల్లో ఏకపక్షంగా గెలిచారు.

### రెండేళ్లకుపైగా పదవీ కాలం - ఉపఎన్నికలు వచ్చే చాన్స్

ఇప్పుడు ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా చేస్తే మండలి చైర్మన్ వెంటనే ఆమోదించే అవకాశాలు ఉన్నాయి. అంటే ఆ స్థానం ఖాళీ అయిపోతుంది. రెండేళ్లకుపైగా పదవి కాలం ఉన్నందున ఎన్నికల సంఘం ఉపఎన్నిక నిర్వహిస్తుంది. ఆ ఎన్నికలో కవిత పోటీ చేసే అవకాశాలు ఉండకపోవచ్చు. కానీ బీఆర్ఎస్ పార్టీకి అడ్వాంటేజ్ తక్కువగా ఉంటుంది. ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీల బలాబలాల్లో పూర్తిగా మార్పు వచ్చింది. నిజామాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ పట్టు కోల్పోయింది. బీఆర్ఎస్ అభ్యర్థి పార్లమెంట్ ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు చాలా వరకూ పార్టీలు మారిపోయారు. బీజేపీ కాంగ్రెస్‌లలో చేరిపోయారు.

### బీఆర్ఎస్ ఓటర్లు అంతా చెల్లా చెదురు - కాంగ్రెస్, బీజేపీలు పోటీ పడే అవకాశం

ఇప్పుడు స్థానిక సంస్థల ఉపఎన్నికలు వస్తే బీఆర్ఎస్ పార్టీ తన ఓటర్లను కాపాడుకోవడం చాలా కష్టం. అందుకే ఆ పార్టీకి చాలా తక్కువ అవకాశాలు ఉంటాయి. అంటే కవిత రాజీనామా చేస్తే ఓ ఎమ్మెల్సీ స్థానం కోల్పోయినట్లు అవుతుంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్యనే పోరాటం జరిగితే బీఆర్ఎస్ పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. కవితకు ఎమ్మెల్సీ పదవి పోతుంది. దాని వల్ల బీఆర్ఎస్ కూ ఒరిగేదేమీ ఉండదు. ఇవన్నీ ఆలోచించి కవిత నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారు.

# ఆఫ్ఘనిస్థాన్ భూకంపంలో మృతుల సంఖ్య @1,411

సెప్టెంబర్ 1న సంభవించిన శక్తివంతమైన భూకంపం కారణంగా ఇప్పటివరకు కనీసం 1,411 మంది మరణించారని, మరో 3,100 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని తాలిబన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ మంగళవారం ప్రకటించారు. ఈ ప్రకృతి విపత్తు ఆఫ్ఘనిస్థాన్‌ను తీవ్ర విషాదంలోకి నెట్టింది. రిక్టర్ స్కేలుపై 6.0 తీవ్రతతో నమోదైన ఈ భూకంపం ధాటికి 5,400 కంటే ఎక్కువ ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని ముజాహిద్ తన 'ఎక్స్' ఖాతాలో వెల్లడించారు. దీంతో వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. ముఖ్యంగా మట్టి, కలపతో నిర్మించిన ఇళ్లు ఎక్కువగా ఉండటంతో అవి భూ ప్రకంపనలకు తట్టుకోలేక పేకమేడల్లా కూలిపోయాయి. గ్రామాలకు గ్రామాలే నేలమట్టం కావడంతో ప్రజలు శిథిలాల కింద చిక్కుకుపోయారు. చాలామంది నిద్రలోనే ప్రాణాలు కోల్పోవడం పెను విషాదానికి కారణమైంది. ప్రస్తుతం మారుమూల పర్వత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అయితే, క్లిష్టమైన భౌగోళిక పరిస్థితులు, సరైన దారులు లేకపోవడం వల్ల సహాయక బృందాలు ఘటనా స్థలాలకు చేరుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఈ పరిస్థితిపై ఐక్యరాజ్యసమితి అధికారి ఇంద్రికా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక సంక్షోభాలతో కొట్టుమిట్టాడుతున్న ఆఫ్ఘనిస్థాన్‌ను అంతర్జాతీయ సమాజం ఆదుకోవాలని ఇంద్రికా విజ్ఞప్తి చేశారు. మరోవైపు, 2021లో అధికారం చేపట్టిన తర్వాత తాలిబన్ ప్రభుత్వం ఎదుర్కొంటున్న మూడో అతిపెద్ద భూకంపం ఇది. అంతర్జాతీయ సహాయం కోసం తాలిబన్లు పిలుపునిచ్చినప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఇతర సంక్షోభాలు, మహిళల హక్కులపై వారు విధిస్తున్న ఆంక్షల కారణంగా ఆఫ్ఘనిస్తాన్‌కు అందే విదేశీ సాయం గణనీయంగా తగ్గిపోయింది.

# కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే ప్రసక్తే లేదు

అంతర్గత వ్యవహారమని, దానితో తమకు సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ కవిత చేసిన తాజా వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి సొమ్ము పంపకాల్లో తేడాలు రావడం వల్లే ఇప్పుడు కవిత ఆరోపణలు చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి బాగోతాన్ని కవిత పూర్తిగా బహిర్గతం చేయాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై కఠిన చర్యలు తీసుకున్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న కారణంతో ఆమెను పార్టీ నుంచి తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీలోని కీలక నేతలు హరీశ్ రావు, సంతోష్ రావులపై కవిత బహిరంగంగా విరుచుకుపడిన నేపథ్యంలో బీఆర్ఎస్ అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకుంది. అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన వెంటనే, హరీశ్ రావు, మాజీ ఎంపీ సంతోష్ కుమార్, మాజీ రాజ్యసభ సభ్యుడు మేఘా కృష్ణారెడ్డిపై కవిత తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కేసీఆర్ ప్రతిష్ఠకు వీరే మచ్చ తెచ్చారని ఆమె ఆరోపించారు. కేసీఆర్ చుట్టూ ఉన్న కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పెద్ద కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారని, వారి వల్లే ఇప్పుడు కేసీఆర్ సీబీఐ విచారణను ఎదుర్కోవాల్సి వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "ఐదేళ్లు నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసిన హరీశ్ రావుకు ఈ విషయంలో ప్రధాన పాత్ర లేదా?" అని కవిత సూటిగా ప్రశ్నించారు. కవిత వ్యాఖ్యలను పార్టీ నాయకత్వం తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకుంది.

# వరద సాయం @ రూ.200 కోట్లు

ఆరోపించారు. "ఓటర్ల స్వేచ్ఛను హరించిన చంద్రబాబు" అంటూ ప్లకార్డులు ప్రదర్శించి తమ నిరసనను తెలిపారు. గ్రామస్థులు చెప్పిన విషయాలపై జగన్ స్పందిస్తూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించే ధైర్యం తెలుగుదేశం పార్టీకి లేదు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశాన్ని కూడా ఇవ్వకుండా అడ్డుకున్నారు. పోలీసుల సాయంతో దౌర్జన్యాలు చేశారు" అని జగన్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలతో ప్రజలను మోసం చేశారని కూడా ఆయన విమర్శించారు.

# టీడీపీకి ఆ ధైర్యం లేదు

ఆరోపించారు. "ఓటర్ల స్వేచ్ఛను హరించిన చంద్రబాబు" అంటూ ప్లకార్డులు ప్రదర్శించి తమ నిరసనను తెలిపారు. గ్రామస్థులు చెప్పిన విషయాలపై జగన్ స్పందిస్తూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించే ధైర్యం తెలుగుదేశం పార్టీకి లేదు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశాన్ని కూడా ఇవ్వకుండా అడ్డుకున్నారు. పోలీసుల సాయంతో దౌర్జన్యాలు చేశారు" అని జగన్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలతో ప్రజలను మోసం చేశారని కూడా ఆయన విమర్శించారు.

# అన్నదాత సుఖీభవ



నిత్యానందకరీ వరాభయకరీ సౌందర్యరత్నాకరీ నిర్ధూతాఖిలఘోరపాపనికరీ ప్రత్యక్షమాహేశ్వరీ ఎ ప్రాలేయాచలవంశపావనకరీ కాశీపురాధీశ్వరీ భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ !

అన్నపూర్ణే సదాపూర్ణే శంకరప్రాణవల్లభే ఎ జ్ఞానవైరాగ్యసిద్ధ్యర్థం భిక్షాం దేహీ చ పార్వతి !

అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారు. అన్నం లేనిది ఏ ప్రాణి జీవించలేదు. అన్నం ఎటువంటి లోటు లేకుండా దొరకడం అంటే సాక్షాత్తు ఆ కాశీ అన్నపూర్ణ అమ్మవారి అనుగ్రహం తప్పనిసరి కావాలి. ఆ అమ్మను నిత్యం కొలిచేవారికి అన్నపానాదులకు ఎటువంటి లోటు ఉండదు. ప్రతి నిత్యం భోజనం చేసేటప్పుడు ఆ అమ్మను కృతజ్ఞత పూర్వకంగా ధ్యానం చేసుకుని విశ్వంలో మనతోపాటు ఉండే అనేకానేక జీవులకు బలిభుక్కులు సమర్పించి భోజనం చేసినవారికి, అతిథి అభ్యాగతి సేవ, ఆపన్నులకు, ఆకలితో బాధపడేవారికి అన్నప్రసాదాన్ని అందించే వారికి ఆ తల్లి అనుగ్రహం ఉంటుందని శాస్త్ర





ప్రవచనం.

అన్నదానం కోటి గోవుల దాన ఫలితంతో సమానమైనది. ఏది లోపించినా బ్రతకగలం. కానీ ఆహారం లోపిస్తే బ్రతకలేం.

"దానాలన్నింటిలోకెల్లా అన్నదానం మిన్న" అన్నదానాన్ని మించిన దానం మరొకటి లేదని పెద్దలు చెప్తారు. మనిషి ఆశకు అంతులేదు... అదుపు అంతకన్నా ఉండదు, ఎందుకంటే ఏది దానంగా ఇచ్చినా... ఎంత ఇచ్చినా కూడా ఇంకా ఇంకా కావాలనిపిస్తుంది. కానీ అన్నదానంలో మాత్రం దానం తీసుకున్నవారు ఇంక చాలు అని చెప్పి సంతృప్తిగా లేస్తారు. ఏ దానం ఇచ్చినా దానం తీసుకున్నవారిని మనం సంతృప్తిపరచలేకపోవచ్చు కాని అన్నదానం చేస్తే మాత్రం దానం తీసుకున్నవారిని పూర్తిగా సంతృప్తి పరచవచ్చును. అన్నదానాన్ని ఒక యజ్ఞంలా భావించి చేసేవారు కూడా ఉన్నారు. ఆకలిగొని ఉన్నవారికి అన్నదానం చేయలేకయినా అన్నం పెట్టే ఇంటినైనా చూపించమని పెద్దలు చెప్తారు.

**భగవద్గీతలో శ్రీ కృష్ణుడు అర్జునునితో అంటాడు...**

**శ్లో: "అన్నాద్భవన్తి భూతాని పర్జన్యా దన్నసంభవః యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః "**

**తాత్పర్యం :- ప్రాణులు అన్నము వలన కలుగు చున్నవి.**

అన్నము మేఘము ( వర్షము ) వలన కలుగు చున్నది. మేఘము ( వర్షము ) యజ్ఞము వలన కలుగు చున్నది. ఇట్టి యజ్ఞము కర్మ వలన కలుగు చున్నది.

త్రేతాయుగం, ద్వాపర యుగాల్లో యజ్ఞయాగాదులు తపస్సుల ద్వారా మానవులు మోక్షం పొందారు. కలియుగంలో దాన ధర్మాలు, దైవారాధన, నామ పారాయణ, నామస్మరణ మొదలైన వాటి ద్వారా సులభతరమైన మోక్షమార్గాన్ని దైవం ప్రసాదించాడు. దానధర్మాలు ఎవరికున్నంతలో వారు దానం చేసుకోవచ్చు. ఈ దానం చేసేది కూడా మనస్ఫూర్తిగా చేయాలి. ఆడంబరాలకు పోనవసరం లేదు. దానాలు ఎన్నో రాకాలుగా ఉన్నాయి, దానాల్లో కూడా అన్నదానం, వస్త్రదానం, జలదానం గోదానం, కన్యాదానం, సువర్ణదానం, భూదానం మొదలైనవన్నీ చాలా విశిష్టమైనవి. మనిషిని పూర్తిగా సంతృప్తిపరచేది

అన్నదానము. దాహార్తిని తీర్చేది జలదానం. ముఖ్యంగా వేసవికాలంలో బాటసారుల దాహాన్ని తీర్చటం ద్వారా వారికి మనమెంతో మేలుచేసిన వారమవౌతాం. వస్త్రదానం చేస్తే సాక్షాత్తూ ఆ భగవంతుడికే వస్త్రాన్నిచ్చిన పుణ్యం కలుగుతుంది. ఎండ, వాన, చలినుండి పేదలకు కాపాడిన తృప్తి మనకు దక్కుతుంది.

మనం చేసే దానంలో స్వార్థం లేకుండా ఏ ఫలితం ఆశించకుండా చేస్తే ఆ దేవుడే దానాన్ని గ్రహించడానికి వస్తాడని అంటారు. కర్ణుడు, బలిచక్రవర్తి మొదలైనవారి దగ్గరికి భగవంతుడే యాచకుడిగా వచ్చి దానం స్వీకరించి వారికి మోక్షాన్ని ప్రసాదించినట్టు పురాణ, ఇతిహాసాల ద్వార మనకు తెలుస్తుంది. ఒక మనిషి మరణించినా అతడు చేసిన దానధర్మాల వలన ఆజన్మాంతరం అతడి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. దానగుణం లేని మనిషికి మోక్షం కలగదు. ప్రత్యుపకారము ఆశింపక చేసే దానం అత్యున్నతమైంది. ఆకలితో ఉన్నవారికి అనాధలకు, పేదలకు, రోగులకు, వికలాంగులకు, అన్నవస్త్ర ఓషదులు మొదలైనవి లేనివారికి దానం చేస్తే దానిని పాత్రత దానము అనబడును.

అన్న దానం చేయడంలో ఏ మాత్రం పక్షపాత వైఖరిగాని 'పరతమ' భేద వైఖరి అస్సలు ఉండ కూడదు, చూపకూడదు. సంపద గలవారికి, అధికారం గలవారికి, బంధుమిత్రులకు ప్రత్యేకంగా ఆతిధ్యం ఇస్తూ పేదవారిని తక్కువ చేసి చూస్తే అది అపాత్ర దానం అవుతుంది. బంధుమిత్రులనే ప్రీతిలేకుండా ఉండి ఆర్థిక స్థోమత లేని, శారీరక శక్తి లేనివారికి వృద్ధులకు, ఆభాగ్యులకు సాక్షాత్తు భగవంతునికే అన్ననివేద సమర్పిస్తున్నామన్న భావన చెందుతూ మనస్పూర్తిగా అన్నదానం చేస్తే ఆ పుణ్యఫలం రెట్టింపౌతుంది. పేదవారిని పక్కనబెట్టి అయినవారికి ముందుగా వడ్డిస్తే అన్నదాన పుణ్యఫలం లభించదు. అన్నదానం అంటేనే మనతో ఏ బంధం లేనివారు, నిరుపేదలను "దరిద్ర నారాయణులు" భగవంతునిగా భావించి చేసే మహత్కార్యం ఇది. అన్నదానం జరిగే చోటకు భగవంతుడు పేదవారిగా రూపం దాల్చి వస్తాడు అని పురాణ ఆధారాలున్నాయి.

ఉన్నోడికి అన్నం పెడితే పెట్టిన వారి మేలు కోరుతాడో లేదో తెలియదుకాని లేనివాడికి పట్టెడు అన్నం ప్రేమతో పెడితే వారి దేహాత్మలోని పరమాత్మ సంతృప్తి చెంది వారు వేద ఆశీర్వచానాలు ఇవ్వకున్నా అంతకుమించి దీవిస్తారు. మన పేరు వారికి తెలియకున్ననూ వారంటారు.... ఏ తల్లిదండ్రులు కన్నబిడ్డ మా అయ్యా, మా దొర, మా దేవుడు కడుపునిండా కమ్మని అన్నం పెట్టించాడు ఆయన కడుపు సల్లంగుండా, వాళ్ళ భార్య పిల్లలు సల్లంగుండా, వాడ సల్లంగుండా, వంతన సల్లంగుండా అని నిండు మనస్సుతో దీవిస్తారు. నిజంగా ఆ దీవెనలు దాతకు జీవిత పర్యంతమే కాదు వచ్చే జన్మకు ఆ పుణ్యఫల దీవెనలు సంప్రాప్తిస్తాయి. ఈ అన్నదాన కార్యాక్రమానికి ఎదో రకంగా సహాయపడిన ప్రతి ఒక్కరికి ఆ పుణ్యఫలం లభిస్తుంది. భగవద్గీతలో కృష్ణుగవానుడు యజ్ఞ దాన తపోరూపములైన కర్మలను ప్రతిఫలాపేక్ష లేకుండా తప్పక ఆచరించవలెనని చెప్పాడు.

మహాభారత యుద్ధంలో కర్ణుడు మరణించిన తరువాత స్వర్గానికి వెళ్ళాడు. అక్కడ కర్ణునికి అన్ని సౌకర్యాలు లభించాయి. స్వాగత సత్కారాలు లభించాయి. ఏది కావాలంటే అది పొందే అవకాశం ఉంది. అన్నీ అందుబాట్లో ఉన్నాయి. ఏంలాభం...! కర్ణుడికి ఏదో అసంతృప్తి. ఏదో వెలితి. ఎంత తిన్నా కడుపు నిండినట్టుండడంలేదు. సంతృప్తినేది లేదు. ఎందుకు ఈ విధంగా ఉంటుందో అతనికర్థం కావడంలేదు. ఇదే మాట దేవేంద్రుడిని అడిగాడు కర్ణుడు. అప్పుడు దేవేంద్రుడు చిరునవ్వుతో నీవు అనేక దానాలు చేసావని అడిగినవాడికి లేదనకుండా ఇచ్చే దానకర్ణుడివని చెప్తారు. మరి ఎప్పుడైనా అన్నదానం చేసావా?" అనడిగాడు. దానికి సమాధానం లేదు. నేనెన్నో దానాలు చేసాను గాని అన్నదానం మాత్రం చేయలేదు అన్నాడు కర్ణుడు.

"పోనీ అన్నం పెట్టే ఇల్లయినా చూపించావా?" అనడిగాడు దేవేంద్రుడు. కాస్త ఆలోచించిన కర్ణుడు చెప్పాడు "అవును, ఓ బీదవాడు నా దగ్గరకు వచ్చి అన్నం పెట్టించమని అడిగాడు. అపుడు నేను ఏదో ధ్యాసలో ఉండి, నాకు అవకాశం లేదు గానీ... అక్కడ ఆ ఇంటికి వెళ్ళు అని ఒక ఇంటిని చూపించాను అని చెప్పాడు. అన్నదానం చేసే ఇంటిని చూపించిన నీ వేలిను నోట్లో పెట్టుకో అన్నాడు ఇంద్రుడు. సరేనని ఆ వేలిని నోట్లో పెట్టుకున్నాడు కర్ణుడు. ఒక్క గుటక వేసాడు. ఆ క్షణంలోనే అతని కడుపు నిండిపోయింది. అంతవరకున్న అసంతృప్తి మటుమాయమైంది. ఎనలేని తృప్తి కలిగింది. ఈ కథనం ద్వారా అన్నదానం యొక్క మహత్యం, దాని ప్రాశస్త్యం తెలుస్తోంది.

చాలా మంది అన్నదానం చేయడం మనం చూస్తుంటాం. అయితే అసలు అన్నదానం ఎందుకు చేయాలి? అనే ప్రశ్నకు మనస్సులో మేదాలాడే ప్రశ్నలెన్నో! అన్నదానం చేయడంలో ఒక పరమార్థంతో పాటు ఆనందం ఉన్నది. ఇది కేవలం ఆహారం అందించడమే కాదు. భౌతిక శరీరాన్ని 'అన్నమయ కోశం లేదా ఆహార శరీరం అని పిలుస్తాము, ఎందుకంటే ఇది ఆహార పోషకాలతో కూడి ఉన్నది. అన్నదానం చేస్తే వారికి శరీరాన్ని అందిస్తునట్లే. ఆహారం పట్ల కొంత స్పృహని, అవగాహనని మీలో కలుగచేయడానికి అన్నదానం మీకొక గొప్ప అవకాశం. మీరు దానిని ఆహారంగా మాత్రమే చూడొద్దు, అది జీవితం. మీ ముందు ఆహారం వున్న ప్రతి సారీ అది వాడిపడేసే పదార్థంలా కాకుండా అది జీవం అని అర్థం చేసుకోవాలి.

మీ జీవితాన్ని ఉన్నతం చేసుకోవాలనుకుంటే మీరు తప్పనిసరిగా ఆహారాన్ని, నీటిని, గాలిని, భూమిని ఒక జీవంగా చూడాలి, ఎందుకంటే మీ శరీర నిర్మాణానికి ఇవే ముఖ్యమైన పదార్థాలు. మీరు వీటిని జీవాధారంగా ఆశ్రయిస్తే అవి మీ శరీర నిర్మాణంలో చాలా భిన్నంగా ప్రవర్తిస్తాయి. అలాగాక మీరు వాటిని ఒక పదార్థంగా చూస్తే మీ వ్యవస్థ మార్కెట్ లా తయారౌతుంది. ప్రేమ, అంకిత భావంతో వడ్డించి అన్నదానం చేయడం ద్వారా మీకు ఎదుటి వారితో ఒక లోతైన సంబంధం ఏర్పడుతుంది. మీరు దీనిని గొప్ప అంకితభావంతో చేయాలి. ఎందుకంటే దీని ద్వారా ఒకరికి జీవితాన్నిచ్చే అవకాశం మీరు పొందుతున్నారు కాబట్టి.

భోజనం చేసేముందు మొదటి ముద్దను పరమేశ్వరార్పణం చేసి దానిని కాకులకో ఇతర పక్షులకో, ప్రాణులకో పెడతారు. ఇలా చేయడం వలన భగవంతునికి సమర్పించినట్లు అవుతుంది. ఇక అన్నం తినే ముందు కొద్దిగా అన్నాన్ని కాకులకు వేయడం వలన శని దోషాల నుంచి బయటపడవచ్చని కూడా చెప్తారు. ఇలాంటి విషయాలు పాటిస్తుంటే మనకు మన ఇంటిల్లిపాదికీ ఆయురారోగ్యాలకి ఎటువంటి లోటూవుండదు. అందరి ఆలోచనలు సన్మార్గంలో నడుస్తాయి. తినే పదార్థాలని వృథాచేయకుండా సద్వినియోగం చేస్తూవుంటే ఆ అన్నపూర్ణమ్మ తల్లి నిత్యం మనింట్లో ధాన్యరాసుల్ని కురిపిస్తుంది.

అలక్ష్యం చేస్తే భుక్తి కోసం వెంపర్లాడక తప్పని పరిస్థితిని చవిచూడవలసి వస్తుంది.

మనిషి పుట్టేప్పుడు ఏమి తీసుకురాడు, ఈ మధ్యకాలంలో ఏం సంపాదించినా, ఎంత కూడబెట్టినా పోయేటప్పుడు ఎవరూ ఏమి తీసుకువెళ్ళరు. కేవలం మంచి చెడు కర్మ ఫలితాలు తప్ప.

భగవంతుడిచ్చిన సంపదలో మనిషి బ్రతికి ఉన్నన్ని రోజులు "అహంబ్రహ్మస్మి"భావనతో తనలో దైవత్వాన్ని అలవరచుకుని తనకు కలిగినంతలో సాటి జీవులకు, ప్రాణులకు దానధర్మాలు చేయాలి. "క్షుద్బాద" ఆకలి అనేది మనకు ఎలా ఉంటుందో ఎదుటివారి ఆకలి కూడా అలాంటిదే అని గ్రహించే స్థాయికి 'స్థితి' కి రావాలి. ఆకలి బాధ అనేది అందరికీ ఒకేలాగే ఉంటుంది కనుక

సాటివారి ఆకలి తీరుద్దాం. అన్నాన్ని గౌరవిద్దాం.. నలుగురిని ఆదరిద్దాం...తృప్తిగా జీవిద్దాం...

**ప్రజా ప్రశ్న... ప్రత్యేక కథనం**

**మేడ్చల్ ప్రతినిధి.. చిన్న**

## నవోదయలో సీటు సాధించిన సాయి ఎక్సలెంట్ స్కూల్ విద్యార్థి

**- విద్యార్థిని అభినందించిన ఎంపీడీవో తాళ్లూరి రవి**



**జూలూరుపాడు (ప్రశ్న న్యూస్)** మండలం కేంద్రంలోని పాపకొల్లు రోడ్డు నందు కలిగిన సాయి ఎక్సలెంట్ స్కూల్ లో మొగిలి గీతిక విద్యార్థిని 8వ తరగతికి నవోదయ సీటు సాధించడం జరిగినది. ఈ సందర్భంగా జూలూరుపాడు ఎంపీడీవో తాళ్లూరి రవి విద్యార్థిని మొగిలి గీతికను శాలువా కప్పి అభినందించారు. అనంతరం రవి. మాట్లాడుతూ సాయి ఎక్సలెంట్ స్కూల్లో నవోదయ సీటు జిల్లా స్థాయిలో సాధించి మండలానికి మంచి పేరు తీసుకురావడం గర్వకారణం అన్నారు. నవోదయ సీటు కోసం విద్యార్థి పట్ల శ్రద్ధ కలిగి కృషిచేసిన స్కూల్ మేనేజ్మెంట్ కు, ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థినికి నవోదయ సీటు సాధించడానికి ప్రోత్సహించిన విద్యార్థిని తండ్రి మొగిలి కృష్ణను ఆయన అభినందించారు. మునుముందు ఇంకా కాంపిటేటివ్ పరీక్షల్లో సాయి ఎక్సలెంట్ స్కూలు మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా సాయి ఎక్సెంట్ పాఠశాల డైరెక్టర్ ఆరెబోయిన హుస్సేన్ మాట్లాడుతూ నవోదయలో మొగిలి గీతిక సీటు సాధించడం చాలా ఆనందంగా ఉందని, ఈ విద్యా సంవత్సరంలో 5వ తరగతి నుంచి 6వ తరగతికి నవోదయలో ఆరుగురు విద్యార్థులు మా యొక్క పాఠశాల నుంచి సీట్లు సాధించడం జరిగిందన్నారు. పల్లె పల్లెకు పట్టణ స్థాయి విద్యను అందించడమే మా యొక్క ముఖ్య లక్ష్యం అన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ అర్హత కలిగిన ఉపాధ్యాయులచే విద్యను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సాయి ఎక్సలెంట్ స్కూల్ డైరెక్టర్లు జక్కుల శివకుమారి, ఆరెబోయిన నాగలక్ష్మి, ఉపాధ్యాయులు నరసింహారావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పాక్షికంగా పలు రైళ్లు రద్దు

బెల్లంపల్లి,: ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ పనుల నిమిత్తం కాజీపేట్ నుంచి బల్లారా వైపు వెళ్లే పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ. శ్రీధర్ తెలిపారు. కాజీపేట్-సిర్పూర్ టౌన్, బల్లార్షా- కాజీపేట్, కాజీపేట్-బల్లార్షా, భద్రాచలం రోడ్ బల్లార్షా, సికింద్రాబాద్-కాగజ్ నగర్ మార్గాల్లో ఈ నెల 3వ తేదీ వరకు రైళ్లు పాక్షికంగా రద్దు చేయబడతాయని ఆయన పేర్కొన్నారు.

## పంట నష్టంపై ఏఈఓ పరిశీలన

చెన్నూరు, : కన్నెపల్లి మండలంలో భారీ వర్షాల కారణంగా పంట నష్టం జరిగింది. మండల వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) శ్రీకాంత్ నష్టపోయిన రైతుల వద్దకు వెళ్లి, పంట నష్టం వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రభుత్వానికి నివేదిక సమర్పించే ప్రక్రియను ప్రారంభించారు. నష్టపరిహారం కోసం రైతులు తమ పట్టా పాస్‌బుక్, బ్యాంక్ బుక్ జిరాక్స్ వంటి వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని మంగళవారం ఏఈఓ శ్రీకాంత్ సూచించారు. తెలియని రైతులకు ఈ సమాచారాన్ని తెలియజేయాలని అధికారులు కోరుతున్నారు.

## త్వరలోనే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలు

మంచిర్యాల, : క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు త్వరలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంగళవారం మందమర్రి తాహశీల్దార్ సతీష్, మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. పాత పోలీస్ స్టేషన్ వద్ద గల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించి, మౌలిక సదుపాయాల కల్పన కోసం కోటి 60 లక్షలు నిధులు కేటాయించినట్లు, త్వరలో పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

## యూరియా కోసం వచ్చిన వారికి అన్నదాన కార్యక్రమం

సిర్పూర్, : మంగళవారం బెజ్జూర్ మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయం వద్ద యూరియా కోసం తెల్లవారుజాము నుండి వేచి చూస్తున్న రైతులకు మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అభిమానులు ఈ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కోనేరు అభిమానులు పాల్గొన్నారు.

## మహిళలు, చిన్నపిల్లల రక్షణకు పోలీసుల కట్టుబాటు

ఆసిఫాబాద్,: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ మాట్లాడుతూ, మహిళలు, చిన్నపిల్లల రక్షణ పోలీసుల తొలి ప్రాధాన్యత అని తెలిపారు. షీ టీమ్, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీమ్, భరోసా సెంటర్లు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఆగస్టులో 83 హాట్‌స్పాట్లు గుర్తించామని, 25 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, 11 ఫిర్యాదులలో 3 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని, 8 కేసుల్లో కౌన్సెలింగ్ జరిగిందని వివరించారు. అవమానాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, హింస జరిగినా నిర్భయంగా ఫిర్యాదు చేయాలని, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## యూరియా కోసం రైతుల ఆందోళన

జగిత్యాల,: జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో డీసీఎంఎస్ వద్ద యూరియా బస్తాల కోసం రైతులు బారులు తీరారు. సరిపోయేంత యూరియా లేదని రైతులు ఆందోళనకు దిగారు. ఉదయం డీసీఎంఎస్ కు 200 బస్తాల యూరియా రాగా, గోదాంలో దింపడం ఆలస్యం కావడంతో రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. పెద్ద సంఖ్యలో రైతులు రావడంతో అధికారులు టోకెన్లు అందజేశారు.

## యూరియా కోసం నిరీక్షణ.. రైతుకు ఫిట్స్

సిరిసిల్ల,: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద మంగళవారం ఉదయం నుండి రైతులు యూరియా కోసం నిరీక్షిస్తున్నారు.

యూరియా పంపిణీ చేస్తున్నారని తెలిసి లైన్లో నిలబడిన పెండల మల్లయ్య (46) అనే రైతుకు ఒక్కసారిగా ఫిట్స్ వచ్చి పడిపోయాడు. అక్కడున్న రైతులు ప్రథమ చికిత్స చేయగా, కుటుంబ సభ్యులు వచ్చి అతన్ని ఇంటికి తీసుకెళ్లారు. యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## వైయస్సార్ సేవలు చిరస్మరణీయం: ఎమ్మెల్యే ఆది

వేములవాడ, : వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండ్ ప్రాంతంలో మంగళవారం వైయస్సార్ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నేతలు నిర్వహించిన కార్యక్రమంలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేసిన మహనీయుడు వైయస్సార్ అని, ఆయన పేదల గుండెల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు.

## బీసీ రిజర్వేషన్ల బిల్లుకు

# గవర్నర్ తక్షణ ఆమోదం తెలుపాలి

**- బీసీ సాధికారత సంఘం ఉమ్మడి జిల్లాధ్యక్షులు : పొలాస నరేందర్**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ వెంటనే ఆమోదం తెలుపాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పొలాస నరేందర్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో మూడు సార్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందిన బిల్లుపై ఆలస్యం చేయకుండా ప్రభుత్వం అఖిలపక్షం మద్దతుతో కేంద్రం,కోర్టుల వద్ద సమన్వయంతో పోరాడాలని సూచించారు. గతంలో లాగా న్యాయపరమైన అడ్డంకులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు నిర్వహించాల్సిన పరిస్థితి ఉన్నందున తక్షణ ఆమోదం అవసరమని నరేందర్ అన్నారు. బిల్లుకు ఆమోదం లభించకపోతే స్థానిక ఎన్నికలు నిలిచిపోవడంతో పాటు గ్రామాల అభివృద్ధి దెబ్బతింటుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## పశువులను నీటి ప్రవాహ ప్రదేశాలకు

## తీసుకువెళ్లవద్దు : జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

- వరద ప్రవాహానికి దెబ్బతిన్న రహదారుల మరమ్మతుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- రైతులు, ప్రజలు, మత్స్యకారులు జాగ్రతగా ఉండాలి
- గంభీరావుపేట మండలంలోని భారీ వర్షాలు, వరద ప్రవాహంతో దెబ్బతిన్న రోడ్లు, మిషన్ భగీరథ పైపులైన్లు, విద్యుత్ లైన్ ల పరిశీలన



**గంభీరావుపేట( ప్రశ్న న్యూస్)** భారీ వర్షాల నేపథ్యంలో మానేరు ప్రవహించే గ్రామాల రైతులు, పశువుల యజమానులు మూగజీవాలను నీరు పారే ప్రాంతాలకు తీసుకువెళ్ళవద్దని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. ఇటీవల భారీ వర్షాలు, వరదల ప్రవాహంతో గంభీరావుపేట మండలంలో దెబ్బతిన్న రోడ్లు, మిషన్ భగీరథ పైపులైన్లు, విద్యుత్ పరికరాలను కలెక్టర్ పరిశీలించారు. నర్మాల నుంచి లింగన్నపేట వెళ్లే రహదారి మొత్తం వరదలకు పాడైంది. రహదారులు, మిషన్ భగీరథ పైప్ లైన్లు, విద్యుత్ పరికరాలకు వెంటనే మరమ్మతు చేయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, పనులు వేగంగా పూర్తి చేసి నీటి, విద్యుత్ లైన్ లను పునరుద్ధరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. వర్షాలు తగ్గే వరకూ పశువుల కాపరులు నీటి ప్రవాహం ప్రదేశాలకు జీవాలను తీసుకువెళ్ళవద్దని సూచించారు. రైతులు, ప్రజలు, మత్స్యకారులు వరద ప్రవాహాల వద్దకు వెళ్లకూడదని పేర్కొన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఇక్కడ గంభీరావుపేట మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కొమిరిశెట్టి విజయ, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, తహసిల్దార్, ఎంపీడీఓ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మానేరులో గల్లంతైయిన వ్యక్తి

## కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సాయం

- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రూ. 5 లక్షల చెక్కు అందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- వరదలో మృతి చెందిన పశువుల యజమానులకు రూ. లక్ష 50 వేల పరిహారం చెక్కుల పంపిణీ



గంభీరావుపేట( ప్రశ్న న్యూస్) నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్ట్ వద్ద గల్లంతైయిన వ్యక్తి కుటుంబానికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేసింది. అలాగే వరదలో చనిపోయిన పశువుల యజమానులకు పరిహారం చెక్కులను పంపిణీ చేసింది.

### ఆర్థిక సహాయం అందించి, భరోసా కల్పించి

గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్ట్ వద్ద పంపుకాడి నాగయ్య మానేరు దాటుతూ గల్లంతు అయ్యారు. ఆయన ఆచూకీ కనిపెట్టేందుకు ఐదు శాఖల అధికారులు, సిబ్బందితో ఇప్పటికే వెతుకుతున్నారు. ఈ సందర్భంగా పంపుకాడి నాగయ్య భార్య లక్ష్మీకి రూ. ఐదు లక్షల విలువైన చెక్కును కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అందజేశారు.

### పశువుల యజమానులకు నష్టపరిహారం

గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన గడ్డమీది మణెమ్మకు చెందిన రెండు పశువులు, ప్రవీణ్ గౌడ్ కు చెందిన ఒక పశువు వరదలో గల్లంతు అయ్యాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నష్ట పరిహారం చెక్కులు గడ్డమీది మణెమ్మకు రూ. లక్ష, ప్రవీణ్ గౌడ్ కు రూ. 50 వేల విలువైన చెక్కును జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ విజయ సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు జిల్లా పశువుల సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి తాసిల్దార్ ఎంపీడీవో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం కుట్రపై బీఆర్ఎస్ ధర్నా



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడలో పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ఖండిస్తూ బీఆర్ఎస్ పార్టీ ధర్నా, రాస్తారోకో, ర్యాలీ నిర్వహించింది. కేటీఆర్ పిలుపు మేరకు నిమ్మశెట్టి విజయ్,గోస్కుల రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ కలిసి కాళేశ్వరం ప్రాజెక్టును శాశ్వతంగా మూసివేయాలని కుట్ర చేస్తున్నాయని నాయకులు ఆరోపించారు. "ప్రాజెక్టు 40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించింది, ఇప్పుడు కూలిందని చెప్పడం ప్రజలను తప్పుదారి పట్టించడం" అని నిమ్మశెట్టి విజయ్ అన్నారు. "సీబీఐ విచారణ వెనుక మోడి-రేవంత్ కుమ్మక్కు ఉంది" అని ఆయన విమర్శించారు. ప్రజల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రామతీర్థపు రాజు, మారం కుమార్, సిరిగిరి చందు, జోగిని శంకర్, గోలి మహేష్, శ్రీకాంత్ గౌడ్, ప్రసాద్ రావు, కోండ కనకయ్య, ఎండి ఉమర్, వెంకట్ రెడ్డి, ఆంజత్ పాషా, నరాల దేవేందర్, వాసాల శ్రీనివాస్, సతీష్ రెడ్డి, ఆనిల్ కుమార్, సందీప్, ఆసద్, రాకేష్, రఫిక్, చిన్న శ్రీనివాస్, షాహిద్, పులి రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బోధనలో నూతన ఆవిష్కరణలు

## ఆకట్టుకున్న టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ మేళా

- సృజనాత్మక బోధనలను టీ.ఎల్.ఎం.మేళాలు దోహదపడుతుతాయి
- డిప్యూటీ డిఈ.ఓ. : లక్ష్మీరాజం






**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ రూరల్ మండలంలో "టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్" (టీ.ఎల్.ఎం.) మేళా మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి లోకిని కిషన్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హన్మాజీపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్ రావు,నూకలమర్రి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సదానందం,వేములవాడ పట్టణ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రాజారత్నం, అలాగే ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల కోసం తాము రూపొందించిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్ ను ప్రదర్శించి,అవి బోధనలో ఎంత ఉపయోగకరమో వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఉప విద్యాధికారి పి. లక్ష్మీరాజం మాట్లాడుతూ "ప్రతి టీ.ఎల్.ఎం. విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యేలా రూపొందించబడింది. సృజనాత్మక బోధనకు టీ.ఎల్. ఎం. వేదికలు ఎంతగానో దోహదం చేస్తాయి" అని పేర్కొన్నారు.

## శ్రీ ఓం గణేష్ మండలి యందు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్,పోలీస్ కమిషనర్



**నిజామాబాద్(ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా లో గల పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో గల శ్రీ ఓం గణేష్ మండలి వద్ద మంగళవారం మధ్యాహ్నం సమయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిలుగా నిజామాబాద్ జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి,( ఐఏఎస్) పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య,(ఐపీఎస్) పాల్గోన్నారు. మొదట పూజా కార్యక్రమం అనంతరం నిజామాబాద్ జిల్లా కలెక్టర్,పోలీస్ కమిషనర్ కలిసి అన్నదాన కార్యక్రమం లో పాల్గోని వచ్చినటు



వంటి వారికి స్వయంగా భోజనం వడ్డించడం జరిగింది. ఈ అన్నదాన కార్య క్రమంలో పెద్ద మొత్తంలో స్నేహా సొసైటీ విధ్యార్దులు ,పోలీస్ సిబ్బంది, ప్రజలు హాజరు కావడం జరిగింది. ఈ కార్యమ్రంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ దినేష్ , అదనపు డి.సి.పి ( అడ్మిన్ ) జి.బస్వా రెడ్డి , (డి ఎం ),హెచ్ ఓ రాజశ్రీ , (ఏడి) ఫిషారీస్ ఆంజనేయులు , నిజామాబాద్ టౌన్ ఏసిపి రాజా వెంకట్ రెడ్డి ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ,రిజర్వు ఇన్స్పెక్టర్స్ లు , ఆర్.ఎస్.ఐలు , ఏ.ఆర్ హెడ్ క్వార్టర్ సిబ్బంది, రేంజ్ కార్యాలయం సిబ్బంది , పోలీస్ కార్యాలయం సిబ్బంది , పోలీస్ గణేష్ మండలి సభ్యులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## బీసీల పేరుతో పోరాటం - బీసీలకే ద్రోహమా?

- కవిత జైలుకెళ్లిన తర్వాత జాగృతి కార్యాలయం రహస్యాలు బహిర్గతం
- రుద్రవరం సింగిల్విండో చైర్మన్ : రేగులపాటి కృష్ణదేవరావు
- జాగృతి కార్యాలయం వివాదంపై ఆరోపణలు



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ ఇందిరాపార్క్లోని బీసీ సామాజిక వర్గానికి చెందిన (యాదవులు) తన మిత్రునికి చెందిన ఒక కమర్షియల్ కాంప్లెక్స్లో జాగృతి సంస్థ కార్యాలయం ఏర్పాటైన తర్వాత, అనేక సంవత్సరాల పాటు అద్దె చెల్లించలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయని,ఈ విషయాన్ని వేములవాడ అర్బన్ మండలంలోని రుద్రవరం సింగిల్ విండో చైర్మన్ రేగులపాటి కృష్ణదేవరావు ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుంట్ల కవిత జైలుకు వెళ్లిన తరువాత సదరు నా మిత్రుడు కార్యాలయంలోని సామాను బయటకు తీసేయడం జరిగిందని పేర్కొన్నారు. బీసీ వర్గాల కోసం పోరాడుతున్నామని చెప్పుకునే నాయకులు, బీసీ వర్గాలకే ఇబ్బందులు కలిగించడం విచారకరమని రేగులపాటి కృష్ణదేవరావు ఎద్దేవా చేశారు.

## మూడు నెలలుగా జీతాలు లేక

## ఇబ్బంది పడుతున్న గ్రామ పంచాయతీ కార్మికులు

- జిఓ 51 రద్దు చేసి, జిఓ 60 అమలు చేయాలి
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి : కడారి రాములు



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ అర్బన్ మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులకు గత మూడు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వెంటనే బకాయిలను చెల్లించి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. మంగళవారం వేములవాడ అర్బన్ ఆర్అండ్ఆర్ కాలనీ, చీర్లవంచలో కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ %-% "లక్షల్లో వేతనాలు తీసుకునే అధికారులకు ప్రతినెలా జీతాలు సమయానికి ఇస్తున్నారు. కానీ గ్రామ అభివృద్ధి కోసం మురికి, గబ్బులో మునిగి పని చేసే గ్రామపంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటు" అని మండిపడ్డారు.

### ప్రధాన డిమాండ్లు

- జీఓ 51 రద్దు చేసి, జీఓ 60 అమలు చేయాలి
- సుప్రీం కోర్టు సూచించిన విధంగా కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలి
- గ్రామపంచాయతీ కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వాలి
- ప్రమాద భీమా సౌకర్యం రూ.25 లక్షలు కల్పించాలి
- గ్రామపంచాయతీ వాహనాలకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయాలి.

గతంలో నూకలమర్రిలో జరిగిన దుర్ఘటనను ప్రస్తావిస్తూ కడారి రాములు %-% "గస్కంటి పోచయ్య జీపీ ట్రాక్టర్ ప్రమాదంలో మరణించినప్పటికీ, వాహనానికి ఇన్సూరెన్స్ లేకపోవడంతో కుటుంబానికి ఎలాంటి ప్రయోజనాలు అందలేదు. ఇకపై అలాంటి నిర్లక్ష్యం జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి" అని అన్నారు. అదేవిధంగా గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, శాశ్వత ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. "గతంలో కాంగ్రెస్ పెద్దలు ధర్నాల్లో పాల్గొని కార్మిక సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇచ్చారు. ఆ మాటలను గుర్తుంచుకుని చర్యలు తీసుకోవాలి" అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ దుంద్రపల్లి రవీందర్, ఈసరి దేవన్న,దుంద్రపెల్లి లక్ష్మన్, గుడికందుల రమేష్, కంసాని రాయనర్సు, మాన్వాడ పరమేష్, కురుమ గుండయ్య, చిట్యాల రాజయ్య, నేరెళ్ల వెంకటేశం, కంసాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నవోదయలో సీటు సాధించిన

# సాయి ఎక్సలెంట్ స్కూల్ విద్యార్థి..!!

**- విద్యార్థిని అభినందించిన ఎంపీడీవో తాళ్లూరి రవి**



**జూలూరుపాడు (ప్రశ్న న్యూస్)** మండలం కేంద్రంలోని పాపకొల్లు రోడ్డు నందు కలిగిన సాయి ఎక్సలెంట్ స్కూల్ లో మొగిలి గీతిక విద్యార్థిని 8వ తరగతికి నవోదయ సీటు సాధించడం జరిగినది. ఈ సందర్భంగా జూలూరుపాడు ఎంపీడీవో తాళ్లూరి రవి విద్యార్థిని మొగిలి గీతికను శాలువా కప్పి అభినందించారు. అనంతరం రవి. మాట్లాడుతూ సాయి ఎక్సలెంట్ స్కూల్లో నవోదయ సీటు జిల్లా స్థాయిలో సాధించి మండలానికి మంచి పేరు తీసుకురావడం గర్వకారణం అన్నారు. నవోదయ సీటు కోసం విద్యార్థి పట్ల శ్రద్ధ కలిగి కృషిచేసిన స్కూల్ మేనేజ్మెంట్ కు, ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థినికి నవోదయ సీటు సాధించడానికి ప్రోత్సహించిన విద్యార్థిని తండ్రి మొగిలి కృష్ణను ఆయన అభినందించారు.

మునుముందు ఇంకా కాంపిటేటివ్ పరీక్షల్లో సాయి ఎక్సలెంట్ స్కూలు మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా సాయి ఎక్స్లెంట్ పాఠశాల డైరెక్టర్ ఆరెబోయిన హుస్సేన్ మాట్లాడుతూ నవోదయలో మొగిలి గీతిక సీటు సాధించడం చాలా ఆనందంగా ఉందని, ఈ విద్యా సంవత్సరంలో 5వ తరగతి నుంచి 6వ తరగతికి నవోదయలో ఆరుగురు విద్యార్థులు మా యొక్క పాఠశాల నుంచి సీట్లు సాధించడం జరిగిందన్నారు. పల్లె పల్లెకు పట్టణ స్థాయి విద్యను అందించడమే మా యొక్క ముఖ్య లక్ష్యం అన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ అర్హత కలిగిన ఉపాధ్యాయులచే విద్యను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సాయి ఎక్సలెంట్ స్కూల్ డైరెక్టర్లు జక్కుల శివకుమారి, ఆరెబోయిన నాగలక్ష్మి, ఉపాధ్యాయులు నరసింహారావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎలగందుల చెరువు మత్తడి

## దుముకుతోంది, సందర్శకుల ఆనందం

కరీంనగర్, : గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కరీంనగర్ నియోజకవర్గం, కొత్తపల్లి మండలం పరిధిలోని ఎలగందుల చెరువు గరిష్ట స్థాయికి చేరుకుని మత్తడి దుముకుతోంది. ఈ దృశ్యాన్ని తిలకించడానికి పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. చెరువు వద్ద మత్స్యకారులు చేపలు పట్టడంలో నిమగ్నమై ఉండగా, సందర్శకులు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదిస్తూ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## వైయస్సార్ సేవలు చిరస్మరణీయం

ధర్మపురి,: వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండ్ ప్రాంతంలో మంగళవారం వైయస్సార్ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నేతలు నిర్వహించిన కార్యక్రమంలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేసిన మహనీయుడు వైయస్సార్ అని, ఆయన పేదల గుండెల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు.

## చిట్టాపూర్ యువత వినూత్న ప్రయత్నం

కోరుట్ల, : మల్లాపూర్ మండలం, చిట్టాపూర్ గ్రామంలో ఫ్రెండ్స్ స్టార్ యూత్ పర్యావరణహితమైన మట్టి వినాయకుడిని నెలకొల్పారు. నవరాత్రుల అలంకరణను మర్రిచెట్టు ఊడలు, వరి పైరుతో సహజసిద్ధంగా చేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని మానుకుని మోదుగ ఆకులతో ప్రసాదాలు అందిస్తున్నారు. బాలగంగాధర్ తిలక్ స్వాతంత్ర్య ఉద్యమంలో వినాయక చవితిని ప్రారంభించారని, నేడు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయని, మట్టి వినాయకుల పూజను ప్రోత్సహిస్తూ పర్యావరణాన్ని కాపాడుదామని పిలుపునిచ్చారు. నిమజ్జన రోజున ప్రతి ఇంటికి ఒక మొక్కను అందించి "ఒక వినాయకుడు - ఒక మొక్క - ఒక ప్రాణం" నినాదంతో పర్యావరణ అవగాహన పెంపొందించాలని సంకల్పించారు.

# ప్రజా నాయకుడు పవన్ కళ్యాణ్: ఎమ్మెల్యే పాసీం సునీల్ కుమార్

**- ఘనంగా డిప్యూటి సిఎం జన్మదిన వేడుకలు**

**- టవర్ క్లాక్ సెంటర్ లో డొక్కా సీతమ్మ అన్నదాన శిబిరం**



**గూడూరు (ప్రశ్న న్యూస్)** ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిస్వార్థంగా పనిచేసే ప్రజా నాయకుడు పవన్ కళ్యాణ్ అని గూడూరు శాసనసభ్యులు పాసీం సునీల్ కుమార్ అన్నారు. జనసేనపార్టీ నాయకులు తీగల చంద్రశేఖర్ రావ్ ఆధ్వర్యంలో మంగళవారం జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా గూడూరు టవర్ క్లాక్ సెంటర్లో భారీ అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు కోసం నిస్వార్థంగా పవన్ కళ్యాణ్ పని చేశారనీ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా గూడూరు నియోజకవర్గంలో పల్లె పండుగ కార్యక్రమంకు సుమారు 15 కోట్ల రూపాయలు విడుదల చేశారన్నారు. నిధులతో ప్రతి పంచాయతీలో సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మించడం జరుగుతుందని తెలిపారు. రానున్న 15 ఏళ్లు పాటు కూటమి ప్రభుత్వం కలిసి ఉండాలని, పవన్ కళ్యాణ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జనసేన లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరుజిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు పూర్తిగా అభివృద్ధిలో వెనుక పడి ప్రజలు అష్టకష్టాలు పడ్డారనీ, ప్రస్తుతం పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పవన్ కళ్యాణ్ బాధ్యతలు తీసుకున్న అనంతరం గ్రామాలు పూర్తి స్థాయిలో అభివృధి బాటలో పయనిస్తున్నాయన్నారు. జనసేన నాయకులు ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు సామాజిక సేవలోనూ ముందుంటారనని అందులో భాగంగానే డొక్కా సీతమ్మ పేరిట 500 మందికి అన్నదానం నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం కేక్ కట్ చేసి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఓసిమోహన్ మాట్లాడుతు పవన్ కళ్యాణ్ పుట్టినరోజును వివిధ సేవా కార్యక్రమాలు గ్రామ గ్రామాన పండగల జరుపుకుంటామని, ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే సునీల్ అన్నకి,జనసేన నాయకులు తీగల చంద్రశేఖర్ కి మరియు ప్రతిఒక్క జనసేన నాయకులు కార్యకర్తలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సాయికిరణ్, నాగార్జున, మనోజ్, విజయ్, మధు,వంశీ, నవీన్, కుమార్, అనిల్,వసంత్, సాయి, లతీఫ్,గురుబాబు, వేణు, సుభాన్, మురళీ ,జనసైనికులు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.

### -ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్,పండ్లు పంపిణీ

జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదినంను జనసేన పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరుజిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

జనసేన కేంద్ర కార్యాలయం పిలుపు మేరకు మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పి ఓ సిమోహన్, నాగార్జున, నవీన్, అనిల్, వంశీ, కుమార్, లతీఫ్, వసంత్ పెంచలయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

# రాజధాని ప్రాజెక్టులకు ఎస్పీవీ

**- అర్బన్ డిజైన్లు, ఆర్కిటెక్చరల్ గైడ్ లైన్స్ నోటిఫికేషన్ కు ఆమోదం**

**- కన్వెన్షన్ సెంటర్లకు భూమి ఇచ్చేందుకు అంగీకారం - సీఎం చంద్రబాబు నేతృత్వంలో 52వ సీఆర్డీఏ అథార్టీ సమావేశం**



**అమరావతి(ప్రశ్న న్యూస్)** రాజధానిలో కీలక నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి నేతృత్వంలో 52వ సీఆర్డీఏ అథార్టీ సమావేశం జరిగింది. ఏడు అంశాలకు ఈ సమావేశంలో ఆమోదం లభించింది. రాజధాని పరిధిలో చేపట్టే కీలక ప్రాజెక్టులు కార్యరూపం దాల్చేలా స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు, ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు, స్మార్ట్ ఇండస్ట్రీస్, ఐకానిక్ బ్రిడ్జ్, స్పోర్ట్స్ సిటీ, రివర్ ఫ్రంట్, రోప్ వే, ఇన్నర్ రింగ్ రోడ్ వంటి ప్రాజెక్టుల నిమిత్తం స్పెషల్ పర్పస్ వెహికల్ దోహద పడుతుంది. అయితే ఎస్పీవీ పరిధిలోకి బయో డిజైన్ ప్రాజెక్టును కూడా తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. స్పోర్ట్స్ సిటీ తరహాలోనే హెల్త్ సిటీ కూడా అమరావతిలో ఏర్పాటు కానుందని దాని పరిధిలో బయో డిజైన్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని సీఎం చెప్పారు. ప్రజారోగ్య సేవల నిమిత్తం బయో డిజైన్ ప్రాజెక్టులో భాగస్వాములుగా ఉండేందుకు ఏడు దేశాలకు చెందిన నిపుణులు, సంస్థలు సిద్దంగా ఉన్నాయని సీఎం తెలిపారు. ఎస్పీవీ పరిధిలోని ప్రాజెక్టుల డిజైన్, రెవెన్యూ జనరేషన్ మొదలు నిర్మాణం పూర్తి అయ్యేంత వరకు ఎస్పీవీనే పూర్తి బాధ్యత వహించనున్నట్టు అధికారులు సీఎంకు వివరించారు.

### గవర్నమెంట్ కాంప్లెక్స్ కు మౌలిక సదుపాయాలపై ఫోకస్..

అమరావతిలో ప్రభుత్వ భవనాల సముదాయం కోసం అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించిన టెండర్ కు సీఆర్డీఏ అథార్టీ ఆమోదించింది. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ భవనాలకు అనుసంధానంగా రోడ్లు, ఫుట్ పాత్ ల నిర్మాణానికి సంబంధించిన పనులు ఇకపై మొదలు కానున్నాయి. దీంట్లో భాగంగా 53.68 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. రోడ్ల నిర్మాణమే కాకుండా ఏడేళ్ల పాటు రోడ్ల నిర్వహణ బాధ్యతను కూడా టెండర్ దక్కించుకున్న సంస్థే చేపట్టేలా నిబంధనలు పెట్టినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇక రాజధాని ప్రాంతంలో అర్బన్ డిజైన్లు, ఆర్కిటెక్చరల్ గైడ్ లైన్స్ కు సంబంధించిన నోటిఫికేషన్ జారీకి అథార్టీ ఆమోదించింది. డిజైన్లను ఆమోదించే సందర్భంలో జాగ్రత్తలు తీసుకోవాలని.. అమరావతి నగరం మొత్తంగా ఆకర్షణీయంగా కన్పించేలా ఉండాలని చంద్రబాబు సూచించారు. ప్రతి కట్టడమూ ప్రజలను ఆకర్షించేలా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సీఆర్డీఏ పరిధిలో చేపడుతున్న ప్రాజెక్టులతో కార్యాకలాపాలు పెరిగాయని అధికారులు చెప్పగా... ఈ మేరకు అవసరమైన సిబ్బందిని డిప్యుటేషన్, ఆన్ డ్యూటీ విధానంలో నియమించుకునేందుకు సీఎం అనుమతిచ్చారు.

### కన్వెన్షన్ సెంటర్లకు భూములు..

రాజధాని పరిధిలో కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణం కోసం కొన్ని ప్రముఖ హెూటళ్లు ముందుకు వచ్చాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాజధాని పరిధిలో ఇప్పటికే కొన్ని ప్రముఖ హెూటళ్లకు భూములు కేటాయించామని వాటికి అనుబంధంగా కొందరు కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణం చేపట్టాలని భావిస్తున్నారని అయితే అందుకు భూములు ఇవ్వాలని ప్రతిపాదించాయని చెప్పారు. నిర్మాణాలు ప్రపంచ ప్రమాణాలకు ధీటుగా ఉండాలని సూచిస్తూ ముందుకొచ్చిన సంస్థలకు కన్వెన్షన్ సెంటర్ల నిమిత్తం భూములు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారు. మాస్టర్ ప్లాన్ అవసరాలకు అనుగుణంగా ఏమైనా భూ సేకరణ చేపట్టాలంటే రైతులతో మాట్లాడి ఆ ప్రక్రియ చేపట్టనున్నట్టు అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. రైతులతో మాట్లాడి వారికి ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా ప్రక్రియను చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అధికారులు ఇచ్చారు. కృష్ణా నదిలోని ద్వీపాలను అభివృద్ధి చేసి టూరిజాన్ని ఆకర్షించేలా చూడాలని సీఎం సూచించారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, మున్సిపల్, సీఆర్డీఏ, ఏడీసీ సహా వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం నాణ్యమైన
# పోషకాహారం అందించాలి
## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ఎల్లారెడ్డిపేట(ప్రశ్న న్యూస్)** విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. పోతిరెడ్డిపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ లో 25 మంది విద్యార్థులు ఉండగా, మరో విద్యా వాలంటీర్ ను నియమిచాలని ఆదేశించారు. పిల్లలకు మధ్యాహ్న భోజనంలో భాగంగా గోంగూర పచ్చడి మాత్రమే పెట్టడం కలెక్టర్ గమనించారు. గ్రామంలో పలు కాలనీలలో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు, చెత్తాచెదారం ఉండడాన్ని గమనించారు. గ్రామంలోని అన్ని వార్డుల్లో నిత్యం పారిశుధ్య పనులు చేయించాలని, పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి స్కూళ్లో మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. స్కూల్ ఆవరణలో కిచెన్ షెడ్ ను నిర్మించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శిని కలెక్టర్ ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థుల హాజరు వివరాలు అటెండెన్స్ రిజిస్టర్ ప్రకారం తనిఖీ చేశారు. డిజిటల్ స్కూల్లో విద్యార్థుల సంఖ్య బెంచీల సంఖ్య తరగతి గదుల వివరాలు పలు అంశాలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు కలెక్టర్ మ్యాథ్స్ పాఠాలు బోధించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూనిఫామ్ లు విద్యార్థులకు పంపిణీ చేయాలని, కంప్యూటర్ ల్యాబ్ అందుబాటులోకి తీసుకురావాలని, గ్రీన్ బోర్డులు తరగతి గదుల్లో ఏర్పాటు చేయించాలని, ఆహార పదార్థాలు గ్యాస్ స్టౌ పైనే సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సవేరా బేగం, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుని ఆశీస్సులతో అన్నదానం



**శేరిలింగంపల్లి(ప్రశ్న న్యూస్)** జవహర్‌నగర్ కాలనీలో వినాయక విగ్రహం వద్ద మంగళవారం భక్తి శ్రద్ధలతో పూజలు జరిగాయి. గల్లీ గల్లీ మార్మోగిన జయజయధ్వానాలతో గణనాథుని సేవకులు విఘ్నేశ్వరుడిని ఆరాధించారు. మహిళలు, పిల్లలు, యువత కలిసి పాల్గొనడంతో ప్రాంతం పండుగ సందడితో కిక్కిరిసిపోయింది. ఈ వేడుకలో భాగంగా త్రిముఖ గణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. మాజీ కౌన్సిలర్, సంఘ అధ్యక్షులు దొంతి లక్ష్మీనారాయణ గౌడ్ పర్యవేక్షణలో సుమారు రెండువేల మందికి పైగా భక్తులకు మహాప్రసాదం వడ్డించారు. "ప్రతి ఏడాది ఇదే విధంగా వినాయక ఉత్సవాలను విశేషంగా నిర్వహిస్తున్నాం. భక్తుల విశ్వాసం మాకు తోడ్పాటుగా నిలుస్తోంది" అని ఆయన అన్నారు. కార్యక్రమానికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికపూడి గాంధీ ప్రధాన అతిథిగా హాజరై వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు పటాన్‌చెరువు కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్, డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, కాంగ్రెస్ నేత రెడ్డి రఘునాథ్ రెడ్డి, హెూప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ పాల్గొని గణనాథుని ఆశీస్సులు కోరుకున్నారు.

## కుటుంబం కంటే
# పార్టీ క్రమ శిక్షణకే ప్రాధాన్యత
## కేసీఆర్ నిబద్ధతకు నిదర్శనం

**- పార్టీ ప్రాముఖ్యతే ధ్యేయంగా కేసీఆర్ సాహసోపేత నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం**

**- ఎమ్మెల్సీ కవితక్క ఆత్మపరిశీలన చేసుకుంటారని విశ్వసిస్తున్నాం**

**- బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకులు : అనుముల భాస్కర్**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను క్రమశిక్షణ ఉల్లంఘనపై సస్పెండ్ చేసిన కేసీఆర్ నిర్ణయం రాజకీయాల్లో సంచలనంగా మారింది. సొంత కూతురిపై ఇంత కఠిన చర్య తీసుకోవడం ద్వారా పార్టీ క్రమశిక్షణకు కేసీఆర్ ఎంత ప్రాముఖ్యత ఇస్తారో మరోసారి నిరూపించారని బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా నేత అనుముల భాస్కర్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "బీఆర్ఎస్ పార్టీలో క్రమశిక్షణ ముందు ఎవరూ అతీతులు కారని,పార్టీ నియమాలను అతిక్రమించిన ఎవరినైనా వదిలిపెట్టే పరిస్థితి లేదు. సొంత కుటుంబ సభ్యురాలిపై చర్య తీసుకోవడం ద్వారా కేసీఆర్ పార్టీ పట్ల తన కట్టుబాటు నిబద్ధతను నిరూపించారు. ఇది నాయకత్వ ధైర్యానికి నిదర్శనం" అని అన్నారు. అలాగే, "కవితక్కకూడా ఈ విషయాన్ని ఆత్మపరిశీలన చేసుకుంటారని విశ్వసిస్తున్నాం. పార్టీ కోసం అందరం కలసికట్టుగా ముందుకు సాగాలి" అని పార్టీ శ్రేణులకు భాస్కర్ పిలుపునిచ్చారు.

# భక్తుల సేవలపై దృష్టి

**- రాజన్నాలయంలో ఈఓ ఆకస్మిక తనిఖీలు**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** ప్రఖ్యాత శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు జరిపారు. దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈఓ) ఎల్. రమాదేవి స్వయంగా పలు విభాగాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా సెంట్రల్ గోదాం, లడ్డు ప్రసాద కౌంటర్, ప్రధాన బుకింగ్ కౌంటర్, కళ్యాణ కట్ట, అలాగే తాజాగా ఏర్పాటు చేసిన నిత్య కళ్యాణం, చండీ హెూమం, సత్యనారాయణ వ్రతం వంటి సేవల ప్రాంగణాలను ఆమె పరిశీలించారు. అదేవిధంగా ఆలయ పరిసరాల్లో పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. గోదాంలోని రికార్డులు, వస్తువులను సవివరంగా తనిఖీ చేసిన ఈఓ, పరిపాలనలో పారదర్శకత, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు మార్గదర్శకాలను సిబ్బందికి ఇచ్చారు. ఈ సందర్భంగా ఈఓ రమాదేవి మాట్లాడుతూ, "భక్తులకు మంచి అనుభవం కలిగేలా ప్రతీ ఒక్క సిబ్బంది కృషి చేయాలి. సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదు" అని స్పష్టం చేశారు.

## కత్తెర దాడిలో నలుగురికి గాయాలు ఒకరు మృతి



**ధర్పల్లి(ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలో (ఎన్ టి ఆర్ )కాలనీ కి చెందిన కోటగిరి దాసు అదే కాలనీ కి చెందిన మచ్చ లక్ష్మి ఇంట్లోకి ప్రవేశించి నా భార్య విడిపోడానికి కారణం లక్ష్మియే అనే అనుమానంతో తనతో తెచ్చుకున్న బట్టలు కత్తిరించే కత్తెర తో లక్ష్మి పై దాడి చేస్తుండగా అడ్డుగా వచ్చిన లక్ష్మి కూతురు గౌతమి పైన కూడా కత్తెర తో దాడి చేయగా తనకి కూడా గాయాలు అయ్యాయని అరవ గా చుట్టుపక్కల వారు వచ్చి కాపాడే ప్రయత్నం చేస్తుండగా వారిని కూడా కత్తెరతో పొడిచి గాయపరిచాడు.

అటు తరువాత బోజేశ్వర్ కిరాణా దుకాణంకు వెళ్లి కత్తెరతో పొడిచి గాయపరిచాడు. గొడవ జరిగిన అనంతరం ఫిర్యాదురాలిని ,తన తల్లిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి లో చేర్పించగ తన తల్లి చనిపో యిందని ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ధర్పల్లి ఎస్సై కళ్యాణి తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వాహనం నడిపిన
# వ్యక్తులకు జైలు శిక్ష



**ధర్పల్లి( ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో ధర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో యమ్ కళ్యాణి ఎస్సై. డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను అనగా 02.09.2025 నాడు న్యాయస్థానం ముందు హాజరు పరచగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ డి బి తాండా కు చెందిన గుగులోత్ సుభాష్ కు నాలుగు రోజులు జైలు శిక్ష ,ధర్పల్లి కి చెందిన ఉబిడి సత్యనారాయణ కు రెండు రోజులు జైలు శిక్ష విధించగా, వీరిని జైలు కు తరలించడం అయినదని యం. కళ్యాణి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ధర్పల్లి పోలీస్ స్టేషన్ తెలిపారు.



# కొత్త లోక జోరు ఎక్కడి దాకా

మలయాళంలో ఏమో కానీ కొత్త లోక విడుదలకు రెండు రోజుల ముందు వరకు తెలుగులో అస్సలు బజ్ లేదు. ట్రైలర్ వచ్చాక ఒక వర్గం ఆడియన్స్ లో అంచనాలు ఏర్పడ్డాయి కానీ ఏ మేరకు ఆకట్టుకుంటుందనే అనుమానాలు జనాల్లో లేకపోలేదు. టైటిల్ రోల్ పోషించిన కళ్యాణి ప్రియదర్శన్ కి ఇక్కడ పెద్ద ఇమేజ్ లేదు. నిర్మాత దుల్కర్ సల్మాన్ అనే విషయం మన ప్రేక్షకులకు రిజిస్టర్ కాలేదు. సితార సంస్థ డిస్ట్రిబ్యూషన్ తీసుకోవడంతో చెప్పుకోదగ్గ రిలీజ్ దక్కింది. అది కూడా హడావిడిగానే. ఫ్లాట్ స్క్రీన్లు ఉన్న మల్టీప్లెక్సులకు మొదటిరోజు సరైన ప్రింట్ చేరకపోవడంతో తెరకు నాలుగు వైపులా నలుపు మధ్య సినిమా చూశారు. తర్వాత ఈ సాంకేతిక సమస్యను సరిచేశారు. వసూళ్ల విషయానికి వస్తే పోటీలో ఉన్న స్ట్రెయిట్ సినిమాల కంటే కొత్త లోక చాలా మెరుగ్గా పెర్ఫార్మ్ చేసింది. ఏపీ తెలంగాణ కలిపి సుమారు మూడు కోట్ల దాకా గ్రాస్ వచ్చి ఉండొచ్చని ట్రేడ్ రిపోర్ట్. ఇది చాలా పెద్ద మొత్తం. స్టార్లు లేని ఫాంటసీ మూవీకి ఇంత ఆదరణ దక్కడం మాటలు కాదు. అయితే నగరాలు, పెద్ద పట్టణాల్లో స్ట్రాంగ్ గా ఉన్న కొత్త లోక కింది సెంటర్లలో చెప్పుకోదగ్గ స్థాయిలో ఆడియన్స్ ని రాబట్టలేకపోతోంది. కంటెంట్ మాస్ కి చేరేది కాకపోవడంతో రీచ్ పరిమితం అవుతోంది. ఈ రోజు సోమవారం నుంచి ఆక్యుపెన్సీలు బాగా తగ్గిన వైనం బుకింగ్స్ లో కనిపిస్తోంది. రాబోయే శుక్రవారం మూడు చెప్పుకోదగ్గ రిలీజులు ఉండటంతో కొత్త లోకకు ఈ నాలుగు రోజులు కీలకం కానున్నాయి. వీలైనంత రాబట్టుకుని సేఫ్ అయిపోవాలి.

# కనిపించను కానీ వినిపిస్తా..



అదేంటో అనుష్క బయటకి మాత్రం రానంటోంది. నిర్మాతేమో ముందే చేసుకున్న అగ్రిమెంట్ అంటారు. దర్శకుడేమో స్వీటీ కటవుట్ చాలు తను రానవసరం లేదంటారు. అయినా ఇప్పుడున్న పరిస్థితుల్లో నేరుగా హీరో హీరోయిన్లు జనాలను కలుసుకుంటేనే ఓపెనింగ్స్ రావడం కష్టమైపోయింది. అలాంటిది టైటిల్ రోల్ పోషించి తన మీదే బిజినెస్ జరుపుకున్న ప్యాన్ ఇండియా మూవీకి అనుష్క దూరంగా ఉండటం విచిత్రమే. గతంలో మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి టైంలోనూ ఇదే కట్టుబాటు పాటించినప్పటికీ నవీన్ భారం తీసుకున్నాడు కాబట్టి ఇబ్బంది కలగలేదు. కానీ ఘాటీకి ఆ అవకాశం లేదు. దీంతో అనుష్క కనిపించను కానీ వినిపిస్తాను అంటోంది. దగ్గుబాటి రానాతో టెలిఫోన్ ఇంటర్వ్యూ ఇచ్చింది. మిర్చి ప్లస్ ఎఫ్ఎం ద్వారా హీరో విక్రమ్ ప్రభుతో కలిసి ఆడియో కాన్వర్ జేషన్ చేయబోతోంది. మీడియా ప్రతినిధులకు కూడా ఇదే తరహాలో శ్రవణ సంభాషణలు చేయబోతున్నట్టు సమాచారం. ఇది ఎంత వరకు ఉపయోగపడుతుందో చెప్పలేం. ఎందుకంటే అభిమానులకు నేరుగా అనుష్కని చూస్తే వచ్చే కిక్కు కేవలం వింటే రాదు. నవ్వినా, ఎమోషనల్ అయినా అవన్నీ విజువల్ చూస్తేనే ఫీలవ్వగలం కానీ వింటే కాదు. అందులోనూ హైదరాబాద్ లాంటి నగరాల్లో తప్ప ఎంఎఫ్ చానెల్స్ బిసి కేంద్రాల్లో పాపులర్ కాదు. సెప్టెంబర్ 5 ఇంకో నాలుగు రోజులే ఉంది కాబట్టి ఘాటీకి ఈ టైం కీలకం కానుంది. లిటిల్ హార్ట్స్, మదరాసి కాంపిటీషన్ ఉన్నప్పటికీ బడ్జెట్, కాన్వాస్ పరంగా అనుష్కదే పెద్ద చేయి కాబట్టి ఓపెనింగ్స్ వరకు నిర్మాతలు ధీమాగా ఉన్నారు. కంటెంట్ కనక మెప్పిస్తే జనాలు థియేటర్లకు వస్తారు.

# కొత్త కాంతార

## 100 కోట్లు చేస్తుందా ?



వచ్చే నెల అక్టోబర్ 2 విడుదల కాబోతున్న కాంతార చాప్టర్ 1 అప్పుడే అంచనాల పరంగా ఎంత ఎత్తులో ఉందో బిజినెస్ రూపంలో చూపిస్తోంది. హొంబాలే ఫిలిమ్స్ నిర్మించిన ఈ విజువల్ గ్రాండియర్ ని హీరో, దర్శకుడు రిషబ్ శెట్టి చాలా రిస్కులు చేసి తీశాడు. మధ్యలో ఎన్నో ఆటంకాలు, ప్రమాదాలు జరిగాయి. అయిన నెరవకుండా పూర్తి చేశాడు. కాంతార మొదటి భాగం కేవలం పదహారు కోట్లలో తీస్తే ఇప్పుడీ ప్రీక్వెల్ ఏకంగా రెండు వందల కోట్ల దాకా ఖర్చు పెట్టించిందని బెంగళూరు టాక్. నిజమెంతో తెలిసేది థియేటర్ లో కంటెంట్ చూశాకే అయినా మేకింగ్ వీడియోలను బట్టి ప్రొడక్షన్ ఎంత గ్రాండ్ గా ఉందో అర్థం చేసుకోవచ్చు.ఇక ఏపీ తెలంగాణకు సంబంధించిన హక్కుల నుంచి కాంతార చాప్టర్ 1 వంద కోట్లకు పైగానే బిజినెస్ ఆశిస్తోందట. రికవరబుల్ అడ్వాన్స్ పద్ధతి మీద అమ్మకాలు జరుగుతాయని ట్రేడ్ టాక్. ఒక్క నైజామ్ నుంచే 40 కోట్లు అంటే మాములు విషయం కాదు. టయర్ 1 స్టార్ హీరోలకు మాత్రమే ఈ రేట్ పలుకుతుంది. ఆంధ్రా 45 కోట్లు, సీడెడ్ 15 కోట్లు కోట్ చేసినట్టుగా సమాచారం. కొంచెం అటూఇటూ ఈ నెంబర్లకే డీల్స్ క్లోజ్ అవ్వొచ్చని టాక్. బ్రేక్ ఈవెన్ దాటేసి లాభాలు రావాలంటే తెలుగు రాష్ట్రాల నుంచే ఎంతలేదన్నా నూటా డెబ్బై కోట్లకు పైగా గ్రాస్ రావాల్సి ఉంటుంది. ఎక్స్ ట్రాడినరి టాక్ వస్తేనే అది సాధ్యం. కానీ నిజంగా అంత డిమాండ్ ఉందా అనేది ఇంకొద్ది రోజులు వేచి చూస్తే క్లారిటీ వస్తుంది. పవన్ కళ్యాణ్ ఓజి వచ్చిన సరిగ్గా వారం రోజులకే కాంతారా చాప్టర్ 1 రిలీజ్ కానుండటం ఆసక్తికర పరిణామం. ఇంత తక్కువ గ్యాప్ లో రెండు క్రేజీ ప్యాన్ ఇండియా మూవీస్ తలపడటం అరుదుగా జరుగుతుంది. ఒకపక్క ఓజి మీద బయ్యర్లు భారీ ఆశలు పెట్టుకుని ఉన్నారు.

# కథ ముందే చెప్పేస్తే ఎలా?



హారర్ సినిమాల్లో ఒక ట్రెండ్ సెట్ చేయడానికి కారణమైన వాళ్లలో రామ్ గోపాల్ వర్మ ఒకరు. అజయ్ దేవగన్, ఊర్మిళాతో తీసిన భూత్ ఇప్పటికీ కల్ట్ మూవీగా సినీ ప్రియులు చెప్పుకుంటారు. ఆ తర్వాత ఇదే జానర్ లో పదే పదే సినిమాలు తీయడంతో జనాలకు మొహం మొత్తేసింది. తనలో రియల్ ఫిలిం మేకర్ ని పక్కకు తోసేసి కొంత కాలం పొలిటికల్ అజెండా మూవీస్ తీయడం, అవి ఏకంగా పోలీస్ కేసుల దాకా వెళ్లడం వేరే కథ. శివ, రంగీలా, సత్య లాంటి పాత్ బ్రేకింగ్ బ్లాక్ బస్టర్స్ ఇచ్చిన డైరెక్టర్ ఇప్పుడిలా కావడం పట్ల బాధపడని మూవీ లవర్ ఉండడు. అలాని ఆయన ప్రయత్నాలు చేయడం ఆపట్లేదు.రామ్ గోపాల్ వర్మ కొత్త చిత్రం పోలీస్ స్టేషన్ మే భూత్ ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటోంది. ఇవాళ కథేంటో చెప్పేస్తూ వర్మ ఒక ట్వీట్ పెట్టారు. కరుడుగట్టిన గ్యాంగ్ స్టర్ ని ఒక ఎన్కౌంటర్ స్పెషలిస్ట్ కాల్చి చంపేస్తాడు. దీంతో పగబట్టిన ఆ డాన్ ఆత్మ తిరిగి వచ్చి పోలీస్ స్టేషన్ లో ఉన్న ఆ అధికారితో పాటు మిగిలిన వాళ్ళను వేధించడం మొదలుపెడుతుంది. దెయ్యం కాబట్టి చంపడం సాధ్యం కాదు. మరి ఏం చేసి దాన్ని ఆట కట్టిస్తారో తెరమీద చూడాలి. హాలీవుడ్ లో ఒకప్పుడు సెన్సేషన్ సృష్టించిన చైల్డ్స్ ప్లేలోని బొమ్మ దెయ్యాన్ని స్ఫూర్తిగా తీసుకుని వర్మ దీన్ని రాసుకున్నట్టు మోషన్ వీడియో చూస్తే అర్థమైపోతుంది. అరటిపండు ఒలిచినట్టు ఇంత స్పష్టంగా వర్మ స్టోరీ చెప్పేశారు కాబట్టి దానికి అనుగుణంగా ప్రిపేరై థియేటర్ కు రావాలన్న మాట. ఒకప్పటిలా వర్మకు బ్రాండ్ పని చేయడం లేదు.



# ముగ్గురు పిల్లలు కావాలి..

జాన్వి కపూర్ కెరీర్ ఆరంభించింది బాలీవుడ్లో. ఆమె తండ్రి నార్త్ ఇండియన్. కానీ ఆమెను సౌత్ అమ్మాయిలాగే చూస్తారు మనవాళ్లు. అందుక్కారణం తన తల్లి శ్రీదేవి పక్కా సౌత్ ఇండియన్ అమ్మాయి కావడమే. తన వ్యక్తిగత విషయాలు, పెళ్లి, వైవాహిక జీవితం గురించి ఎప్పుడు అడిగినా.. తనలోని సౌత్ ఇండియన్ మూలాలు బయటికి వచ్చేస్తాయి. తాజాగా తన కొత్త చిత్రం 'పరమ్ సుందరి'ని ప్రమోట్ చేయడం కోసం కపిల్ శర్మ షోకు వెళ్లిన జాన్వి.. తన పెళ్లి, పిల్లల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. అందులో అన్నింటికంటే హైలైట్.. పిల్లల గురించి చేసిన కామెంటే. జాన్వికి ముగ్గురు పిల్లలు కావాలట. చాలామంది హీరోయిన్లు పిల్లల్ని కనడానికే ఇష్టపడరు. అలాంటిది ఏకంగా ముగ్గురు పిల్లల్ని కనడం ఏంటి అని అడిగితే.. మూడు తన లక్కీ నంబర్ అంటూ అందరినీ నవ్వుల్లో ముంచెత్తింది జాన్వి. ముగ్గురు పిల్లల్ని కనడానికి మరో కారణం చెబుతూ.. ఇద్దరు ఉంటే గొడవలు జరుగుతాయని.. అందుకే ముగ్గురు కావాలని.. అప్పుడే ఇంట్లో సందడి ఉంటుందని ఆమె చెప్పింది. గతంలో ఒక ఇంటర్వ్యూలో జాన్వి మాట్లాడుతూ.. తనకు తన తల్లి స్వస్థలమైన చెన్నైలో, ఆమె పూర్వీకుల ఇంట్లో పెళ్లి చేసుకోవాలన్నది కోరిక అని వెల్లడించింది. అక్కడ పెళ్లి తంతులన్నీ పూర్తి అయ్యాక తిరుమలలో వివాహం చేసుకోవాలని ఆమె చెప్పింది. అంతేకాక తిరుపతిలోనే సెటిల్ కావాలని ఉందని.. పంచెలో ఉన్న తన భర్తతో కలిసి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేయడం.. అరటి ఆకుల్లో భోజనం చేస్తూ 'గోవిందా గోవిందా' అని నామస్మరణ చేయడం.. ఇంతకంటే తనకు వేరే జీవితం అక్కర్లేదని ఆమె చెప్పింది.

# కల్కి-2 రిలీజ్ గురించి నాగ్ అశ్విన్



ఇండియాలో ప్రస్తుతం మోస్ట్ అవైటెడ్ సీక్వెల్స్‌లో 'కల్కి-2' ఒకటి. ప్రభాస్, దీపికా పదుకొనే, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్‌ల క్రేజీ కాంబినేషన్లో నాగ్ అశ్విన్ రూపొందించిన 'కల్కి' గత ఏడాది విడుదలై ఘనవిజయాన్నందుకుంది. ఆ కథను మధ్యలో ఆపడంతో రెండో భాగం కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఐతే ఆ సినిమా విడుదలై ఏడాది దాటినా ఇంకా సెకండ్ పార్ట్ షూట్ గురించి ఏ అప్‌డేట్ లేదు. నాగ్ అశ్విన్ స్క్రిప్టు రెడీ చేసుకుని, ప్రి ప్రొడక్షన్ పనులు కూడా ఒక కొలిక్కి తెచ్చేశాడు కానీ.. ప్రభాస్ వేరే చిత్రాలతో బిజీగా ఉండడంతో ఎదురు చూపులు తప్పడం లేదు. మరి ఈ సినిమా షూట్ ఎప్పుడు మొదలవుతుంది.. రిలీజ్ ఎప్పుడు ఉంటుంది అన్నదానిపై అందరూ ఎంతో ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. దీని గురించి దర్శకుడు నాగ్ అశ్విన్ ఒక పాడ్ కాస్ట్‌లో మాట్లాడాడు. "కల్కి-2 షూట్ చాలా అంశాలతో ముడిపడి ఉంది. 'కల్కి'లోని ముఖ్య పాత్రధారులందరితో కాంబినేషన్ సీన్లు ఉన్నాయి. అందుకే వాళ్లందరికీ కుదిరినపుడే చిత్రీకరణ జరపాలి. ఇందులో యాక్షన్ సన్నివేశాలు పార్ట్-1ను మించి ఉంటాయి. వాటిని పూర్తి చేయడానికి చాలా సమయం పడుతుంది. అందుకే 'కల్కి-2' రిలీజ్ గురించి నా దగ్గర కచ్చితమైన సమాధానం లేదు. ఈ ఏడాది చివర్లో షూటింగ్ మొదలుపెట్టాలని అనుకుంటున్నాం. కానీ ప్రస్తుతం 'కల్కి' స్టార్స్ అందరూ బిజీగా ఉన్నారు. కాబట్టి ఫలానా టైంలో షూట్ మొదలవుతుందని చెప్పడం కష్టం. ఐతే షూటింగ్‌కు తక్కువ సమయమే పట్టినా.. తర్వాత పోస్ట్ ప్రొడక్షన్‌కు చాలా టైం పడుతుంది. ఇంకో రెండేళ్ల వ్యవధిలో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని అనుకుంటున్నాం. ఏం జరుగుతుందో చూడాలి" అని నాగి చెప్పాడు. 'కల్కి'లో ప్రభాస్, కమల్ హాసన్‌ల పాత్రల పరిధి తక్కువ అని ప్రేక్షకులు ఒకింత అసంతృప్తికి గురయ్యారు. కానీ పార్ట్-2లో వీళ్ల పాత్రలు ఇంకా బలంగా, ఎక్కువ నిడివితో ఉంటాయని

# బెల్లంకొండ సినిమా వాయిదా.. కానీ



తెలుగులో ఒకప్పుడు వరుసగా సినిమాలు చేస్తూ.. అప్పుడప్పుడూ విజయాలు అందుకుంటూ కెరీర్‌ను బాగానే ముందుకు తీసుకెళ్లాడు బెల్లంకొండ శ్రీనివాస్. కానీ మధ్యలో 'ఛత్రపతి' బాలీవుడ్ రీమేక్‌లో నటించడం తన కెరీర్‌కు పెద్ద డ్యామేజీ అయింది. ఆ సినిమా హిందీలో సరిగా ఆడలేదు. పైగా తెలుగులో బాగా గ్యాప్ వచ్చింది. ఈ విరామం తర్వాత 'భైరవం' చిత్రంలో నటిస్తే అది నిరాశపరిచింది. ఐతే తన కొత్త చిత్రం 'కిష్కింధపురి' మీద బెల్లంకొండ శ్రీనివాస్ చాలా నమ్మకంగా ఉన్నాడు. కార్తికేయతో 'చావు కబురు చల్లగా' సినిమా తీసిన కౌశిక్ పెగల్లపాటి ఈ చిత్రాన్ని రూపొందించాడు. ఇది డివైన్ ఎలిమెంట్స్‌తో ముడిపడ్డ ఫాంటసీ హార్రర్ మూవీ. దీని టీజర్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచింది. 'రాక్షసుడు' తర్వాత శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ కలిసి నటించిన చిత్రమిది. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబరు 12న 'కిష్కింధపురి' రిలీజ్ కావాలి. ఐతే అదే రోజు 'మిరాయ్' భారీ అంచనాల మధ్య రిలీజవుతుండడంతో దానికి పోటీగా వెళ్లకపోవడం మంచిదే అన్న సందేహాలు కలిగాయి. రిలీజ్ డేట్ మార్చక తప్పదని అనుకున్నారు. ఆ ప్రకారమే 'కిష్కింధపురి' వాయిదా పడింది. అలా అని వారం, రెండు వారాలేమీ పోస్ట్ పోన్ చేయలేదు. ఒక్క రోజు ఆలస్యంగా సెప్టెంబరు 13న ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. 13న అన్నది హార్రర్ చిత్రాలకు సెంటిమెంటుగా కలిసొచ్చే డేట్. హార్రర్ చిత్రాల టైటిళ్లు కూడా ఈ నంబర్‌తో పెడుతుంటారు. '13 బి' అందుకు ఉదాహరణ.

## బీసీల పేరుతో పోరాటం

# బీసీలకే ద్రోహమా?

- కవిత జైలుకెళ్లిన తర్వాత జాగృతి కార్యాలయం రహస్యాలు బహిర్గతం
- రుద్రవరం సింగిల్విండో చైర్మన్ : రేగులపాటి కృష్ణదేవరావు
- జాగృతి కార్యాలయం వివాదంపై ఆరోపణలు



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ ఇందిరాపార్క్‌లోని తన మిత్రునికి చెందిన ఒక కమర్షియల్ కాంప్లెక్స్‌లో జాగృతి సంస్థ కార్యాలయం ఏర్పాటైన తర్వాత, అనేక సంవత్సరాల పాటు అద్దె చెల్లించలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయని, ఈ విషయాన్ని వేములవాడ అర్బన్ మండలంలోని రుద్రవరం సింగిల్ విండో చైర్మన్ రేగులపాటి కృష్ణదేవరావు ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుంట్ల కవిత జైలుకు వెళ్లిన తరువాత సదరు నా మిత్రుడు కార్యాలయంలోని సామాను బయటకు తీసేయడం జరిగిందని పేర్కొన్నారు. బీసీ వర్గాల కోసం పోరాడుతున్నామని చెప్పుకునే నాయకులు, బీసీ వర్గాలకే ఇబ్బందులు కలిగించడం విచారకరమని రేగులపాటి కృష్ణదేవరావు ఎద్దేవా చేశారు.

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో

# ఛలో కలెక్టరేట్ విజయవంతం

- డిమాండ్లు పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం
- ఎస్ ఎఫ్ ఐ నేతల హెచ్చరిక




**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల డిమాండ్ చేస్తూ విద్యార్థులు ధర్నా చేశారు. కలెక్టరేట్ ప్రాంగణం నినాదాలతో మార్మోగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ, "కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతోంది. రూ. 8,000 కోట్లు బకాయిలు క్లియర్ చేయాలి. వెంటనే విద్యాశాఖ మంత్రిని కేటాయించి మెస్ ఛార్జీలు పెంచాలి, వసతి గృహాలకు శాశ్వత భవనాలు కట్టాలి" అని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుండెల్లి కళ్యాణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్‌కుమార్, గర్ల్స్ కన్వీనర్ సంజన, కమిటీ సభ్యులు సాయి భరత్, శివ, నాయకులు తిరుపతి, జలంధర్, అరుణ్, విష్ణు, యశ్వంత్, కృష్ణతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజాసంక్షేమానికి స్వర్గీయ

# డాక్టర్ వైఎస్ఆర్ నిలువెత్తు నిదర్శనం

- కాంగ్రెస్ పార్టీ రూరల్ నాయకులు
- నూకలమర్రిలో వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా నూకలమర్రి గ్రామంలో మంగళవారం రూరల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంక్షేమానికి ప్రాణం పోసిన వైఎస్ఆర్ సేవలను గుర్తు చేసుకుంటూ, ఆయన పాలనలో అమలు చేసిన పథకాలను నాయకులు స్మరించుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా వైఎస్ఆర్ మార్గదర్శకత్వంలో ప్రారంభించిన పథకాలనే కొనసాగిస్తోందని, వాటి ద్వారా ప్రజలు లబ్ధిపొందుతున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ రూరల్ అధ్యక్షులు వకులాభరణం శ్రీనివాస్ వేములవాడ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాలకుర్తి పరశురాములు, మాజీ ఎంపీటీసీ బొడ్డు శంకరవ్వ, మాజీ సర్పంచ్ పిట్టల వెంకటేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రోమాల ప్రవీణ్, మండల యూత్ కో-ఆర్డినేటర్ సామల్ల రజనీకాంత్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ ఆదిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఈఓ రమాదేవి

- రాజన్నాలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం - విప్ ఆది
- రాజన్నాలయ అభివృద్ధి దిశగా అడుగులు - ఈఓ -విప్ చర్చ



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎల్. రమాదేవి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ను మంగళవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్క, స్వామివారి కండువా, స్వామి వారి లడ్డూ ప్రసాదం అందజేసిన ఈఓ రమాదేవికి విప్ ఆది శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆలయ అభివృద్ధి, భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించే దిశగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై కాసేపు చర్చ జరిగింది. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పట్ల తన కట్టుబాటును వ్యక్తం చేస్తూ పూర్తి స్థాయి సహకారం అందిస్తామని ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

# గణేశ్ నిమజ్జనోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి

## జగిత్యాల కలెక్టర్ సత్య ప్రసాద్

- పటిష్ట బందోబస్తు: ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్ద- ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాస్, జీవాకర్ రెడ్డి, డీఎస్పీలు రఘు చందర్, రాములు, పోలీస్, రెవిన్యూ ,మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు
- నిమజ్జన ప్రాంతాలను జగిత్యాలలో చింతకుంట చెరువు, కోరుట్లలో పెద్దవాగు, మెట్పల్లిలోని వట్టి వాగు, రాయపట్నం బ్రిడ్జి ప్రత్యక్షంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్,ఎస్పీ
- గణేశ్ నిమజ్జనం శాంతియుతంగా జరపాలి : జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

**జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)** ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సజావుగా జరిగేలా అన్ని విభాగాలు సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. జిల్లా ఎస్పి అశోక్ కుమార్ ఐపిఎస్ తో కలిసి గణేష్ నిమజ్జన ప్రాంతాలైన జగిత్యాలలో చింతకుంట చెరువు, కోరుట్లలో పెద్దవాగు, మెట్పల్లిలోని వట్టి వాగు, రాయపట్నం బ్రిడ్జి ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. నిమజ్జన ఘాట్‌ల వద్ద ప్రజలకు తాగునీరు, లైటింగ్, శానిటేషన్ వంటి సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. నిమజ్జన%శీ% కు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అదికారులను ఆదేశించారు. విగ్రహాల తరలింపు సమయంలో ఎక్కడ విద్యుత్ షాక్ గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ వారికి జిల్లా కలెక్టర్ సూచించారు. మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ అధికారులు, పోలీస్ శాఖ సమన్వయంతో నిమజ్జన కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

### పోలీస్ శాఖ తరపున అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టడం జరుగుతుంది: ఎస్పీ అశోక్ కుమార్

వినాయక నిమజ్జన కార్యక్రమాలు శాంతియుతంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సజావుగా పూర్తి కావడానికి పోలీస్ శాఖ తరఫున అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎస్పి అన్నారు. నిమజ్జన కార్యక్రమాలు అంతయు ప్రశాంత వాతావరణం లో పూర్తి అయ్యేలా అవసరమైన ప్రాంతాలలో సిసి కెమెరాలను, వీడియోగ్రఫీ ఏర్పాటు చేశామని, స్థానిక గజ ఈతగాళ్లు ను నిమజ్జన కార్యక్రమాల ప్రాంతములో అందుబాటులో ఉంచమని, శోభాయాత్ర వెళ్ళేమార్గం లో ఇతర శాఖ ల యొక్క సమన్వయముతో ఎటువంటి అవాంతరములు తలెత్తకుండా పటిష్టమైన చర్యలను తీసుకుంటున్నామని జిల్లా ఎస్పి గారు తెలిపారు. నిమజ్జనం సందర్భంగా డీజేలు, సౌండ్ సిస్టంలు, బాణాసంచా కాల్చడం వంటివి చేయరాదని తెలిపారు. చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, చట్టానికి లోబడి నడుచుకోవాలని తెలిపారు. చట్టానికి విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తించిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక శాంతియుతంగా, సామరస్యంగా జరుపుకోవాలని అందుకు ప్రజలు పూర్తిగా పోలీసు వారికి సహకారం అందించాలని జిల్లా ఎస్పి కోరారు. ఈ కార్యక్రమమంలో ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాస్, జీవాకర్ రెడ్డి, డీఎస్పీలు రఘు చందర్, రాములు, పోలీస్, రెవిన్యూ ,మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు



# వైఎస్ ఆలోచనలే నేటితరానికి మార్గదర్శకం

- వైఎస్ చిరకాల వాంఛను సాధించాలి - రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలి
- ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్
- కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి వేడుకలు



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ వద్ద పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, "వైఎస్ రాజశేఖర రెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు. పేదల పరిరక్షణలో ఆయన చూపిన తపన మరువలేనిది. ఇచ్చిన మాటకు కట్టుబడి, మాట తప్పని నైజం ఆయనది" అన్నారు. అలాగే ఆయన యువతకు ఆదర్శప్రాయమైన వ్యక్తి అని, వారి ఆలోచన విధానం ప్రస్తుత తరం నేర్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. వైఎస్ పాలనలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించారని ఆయన గుర్తుచేశారు. ముఖ్యంగా ఫీజు రీయింబర్స్మెంట్, ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్, రైతులకు ఉచిత విద్యుత్, కొనుగోలు కేంద్రాలు వంటి పథకాలు ఆయన హయాంలోనే ప్రారంభమయ్యాయని అన్నారు. ప్రాంత అభివృద్ధిలో వైఎస్ పాత్ర ఆయన కాలంలో మన ప్రాంతంలో కూడా అనేక ప్రాజెక్టులు, పథకాలకు శంకుస్థాపన జరిగినట్లు వివరించారు. 2005లో మల్యాల గ్రామంలో జరిగిన ప్రజా పతం సభలో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుండి రుద్రంగి కలికోట వరకు 1737 కోట్లతో ఎత్తిపోతల పథకం శంకుస్థాపన చేశారు. వేములవాడలో 9 కోట్లతో ఎంఎండీ నుండి నాంపల్లి వరకు నీటి సరఫరా అందించారు. రాజన్న భక్తులకు తాగునీటి సమస్య లేకుండా పరిష్కరించారు. నాలుగు జూనియర్ కళాశాలలు మంజూరు చేసి, అగ్రహారంలో సైన్స్ విభాగాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా వైఎస్ మార్గంలో నడుస్తున్నారని ఆది శ్రీనివాస్ అన్నారు. "ఇటీవల 10 కోట్లతో బాలికల హాస్టల్ మంజూరైంది. ఇదే ప్రజా పాలన కొనసాగింపు" అని పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి చిరకాల కోరిక రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడడం అని గుర్తుచేసిన ఆయన, ఆ దిశగా కాంగ్రెస్ పార్టీ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

- భావన గౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



**నాచారం(ప్రశ్న న్యూస్)** నాచారం రాఘవేంద్రనగర్‌లోని ఈగల్ వింగ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. మండపాన్ని కళాత్మకంగా అలంకరించగా, ప్రతిరోజూ గణనాథునికి ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్తయ భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించి, స్వయంగా అన్నం వడ్డించి సేవాభావాన్ని చాటుకున్నారు. భక్తుల ఆశీస్సులు అందుకున్న భావన గౌడ్‌ను అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఉత్సవాలకు స్థానిక భక్తులు పెద్దఎత్తున హాజరై గణనాథుని దర్శించుకుంటూ భక్తి భావంతో పూజలు చేశారు. స్థానికులు, యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఈగల్ వింగ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు వినయ్, అఖిల్, రాహుల్, ప్రవీణ్, శివ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# గణపయ్యకు ఘనమైన పూజలు

## - అలరించిన సంస్కృతిక కార్యక్రమాలు

బడంగ్ పేట్(ప్రశ్న న్యూస్) వినాయక నవరాత్రుల పూజలలో భాగంగా శ్రీసాయిబాలాజీ హెూమ్స్ పేస్ 2 రోడ్ నంబర్ 8 లో వసుదైక కుటుంబం, భగత్ సింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వినాయక మండపంలో వినాయక నవరాత్రుల పూజా కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నామని ప్రముఖ వేద పండితులు శ్రీరాంశర్మ తెలిపారు. ప్రతిరోజు జరిగే వినాయక ప్రత్యేక పూజలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని, పూజల అనంతరం మహా హరతి, తీర్థప్రసాధాల వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే నవరాత్రుల కార్యక్రమాలలో భాగంగా వినాయక మండపం వద్ద అన్నప్రసాధ వితరణతో పాటు పలు సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తునట్లు తెలిపారు

గత ఆదివారం నిర్వహించిన అన్న ప్రసాధవితరణ కార్యక్రమంలో ముఖ్య అథితిగా పాల్గొన్నమహేశ్వరం నియోజకవర్గ బీజేపి శాసనసభ కంటెస్టెడ్ అభ్యర్థి అందెల శ్రీ రాములు యాదవ్ స్వామివారి దర్శించుకుని ప్రత్యేక పూజలను చేసారు.

### అన్నమాచార్య సంకీర్తన గానామృతం

వినాయక మండపం వద్ద గత సోమవారం రాత్రి నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా, శ్రీ వెంకటేశ్వర సంగీత విద్యాలయంలో సంగీత అధ్యయనం చేస్తున్న శ్రీ సాయి బాలాజీ హెూమ్స్ ఫేస్ 2 కాలనీకి చెందిన చిన్నారులు అలపించిన అన్నమాచార్య సంకీర్తన గానామృతం ప్రాధాన్యతను సంతరించుకుంది.





### సి.ఐ ప్రత్యేక పూజలు

వసుదైక కుటుంబం, భగత్ సింగ్ యూత్ అసోసియేషన్ ఆద్వర్యంలో శ్రీసాయిబాలాజీ హెూమ్స్ పేస్ 2 రోడ్ నంబర్ 8 సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించిన మీర్ పేట్ సర్కిల్ ఇన్స్ పెక్టర్ శంకర్ కుమార్ వినాయక స్వామిని దర్శించుకొని పూజలు చేసి మండప నిర్వాహకులకు, భక్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు.







# దారితప్పిన బీఆర్ఎస్

## పార్టీపై గ్రిప్ కేసీఆర్‌కు లేదా.?

**- కవిత వర్సెస్ కేటీఆర్.. కేసీఆర్ చేతులెత్తేసినట్టేనా.?**

**- కవిత మాటలతో బీఆర్ఎస్ ప్రభుత్వంలో కోట్ల అవినీతి జరిగింది నిజమేనా.?**








**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బిఆర్ఎస్ పార్టీ దారి తప్పిందా.? బీఆర్ఎస్ పార్టీలో కవిత కేటీఆర్ ల మధ్య జరుగుతున్న ప్రచ్ఛన్న యుద్ధాన్ని కేసీఆర్ ఆపలేకపోయారా.? కవిత పైన సస్పెన్షన్ వేటు వేసి పార్టీ పరిస్థితిని మరింత దిగజార్చారా.? కవిత వేరే కుంపటి పెడితే బిఆర్ఎస్ పార్టీకి నష్టం కాదా.? స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు కవిత వ్యవహారంలో కెసిఆర్ తీసుకున్న ఈ అనాలోచిత నిర్ణయం పార్టీ కొంప ముంచుతుందా.? అంటే అవును అన్న సమాధానమే వస్తుంది ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే.

### కేసీఆర్ గీత దాటిన సొంత బిడ్డలు

ఒకప్పుడు కెసిఆర్ గీసిన గీత దాటని బీఆర్ఎస్ పార్టీ లో పరిస్థితులు ఉండేవి కానీ నేడు జరుగుతున్న పరిణామాలు కెసిఆర్ మాటకు అసలు విలువ లేదు అన్న భావన కలిగిస్తున్నాయి.

బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఒక్క మాట చెబితే ఆగాల్సిన చోట కన్న బిడ్డలే కయ్యానికి కాలు దువ్వి పార్టీని నాశనం చేసిన పరిస్థితి కనిపిస్తుంది. ఒకప్పుడు కెసిఆర్ ఏది చెబితే అదే శాసనం, కానీ ఇప్పుడు కెసిఆర్ చెప్పిన మాట కొడుకు, కూతురే వినే పరిస్థితి లేదు. దానితో పార్టీ నాయకుల సైతం క్రమశిక్షణను ఉల్లంఘించే అవకాశాలు ఉన్నాయి పార్టీలో రోజురోజుకు తిరుగుబడే నాయకులు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### కొడుకు, కూతురును కంట్రోల్ చెయ్యలేని కేసీఆర్

కొడుకు కేటీఆర్ కి కూడా కెసిఆర్ చెప్పలేకపోతున్నాడు అన్న భావన తాజా పరిస్థితులతో కనిపిస్తుంది. కేటీఆర్ చెప్పిన దానికి తలూపటమే తప్ప సొంత నిర్ణయాలు అధినేత తీసుకోలేకపోతున్నారన్న చర్చ రాష్ట్రవ్యాప్తంగా సాగుతుంది. పార్టీలో కోవర్టులు ఉన్నారని కవిత నోరు తెరిచిన నాడే కవితను పిలిచి వివాదానికి చెక్ పెట్టాల్సిన అధినేత కేసీఆర్ ఆ పని చెయ్యలేదు. ఫలితంగా కవిత పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతూనే ఉన్నారు. రోజురోజుకు బీఆర్ఎస్ పార్టీలో జరిగిన అంతర్గత వ్యవహారాలను ప్రజల ముందు ఉంచి బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులను నాయకులను ప్రజల ముందు దోషులుగా అవినీతిపరులుగా నిలబెడుతున్నారు కవిత.

### పదేపదే వారిని టార్గెట్ చేసిన కవిత

కవిత కేసీఆర్ మంచోడే, ఆయన చుట్టూ ఉండే వాళ్ళే దుష్ట గ్రహాలు, దెయ్యాలు, రాక్షసులు అంటూ సంతోష్ తదితరులను టార్గెట్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పి సి ఘోష కమిషన్ నివేదిక పై అసెంబ్లీలో చర్చ జరిగిన తర్వాత సిబిఐ ఎంక్వయిరీకి ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించడంతో కవిత హరీష్ రావును, సంతోష్ ను టార్గెట్ చేసి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దానితో కాళేశ్వరం ప్రాజెక్టులో భారీగా అవినీతి అక్రమాలకు పాల్పడింది హరీష్ రావు అన్న సాంకేతాలు ప్రజలలో వెళ్లిపోయాయి లక్షల కోట్ల అవినీతికి పాల్పడింది నిజమే అన్న అభిప్రాయానికి తెలంగాణ ప్రజలు వచ్చారు.

### కేసీఆర్ కు పార్టీ పై గ్రిప్ లేదు

కేసీఆర్ పై సిబిఐ ఎంక్వయిరీ అంటే తనకు ఒళ్ళు మండి పోతుందని, దీనంతటికీ కారణం హరీష్ రావే అని ఆమె టార్గెట్ చేశారు. కవిత వ్యాఖ్యలతో సీరియస్ స్టెప్ తీసుకున్న అధినేత బిఆర్ఎస్ పార్టీ నుండి సస్పెండ్ చేశారు. అయితే ఈ వ్యవహారం అంతా కెసిఆర్ కు పార్టీ పైన గ్రిప్ లేదన్న విషయాన్ని స్పష్టం చేస్తుంది.

### కేసీఆర్ చేతులెత్తేశారా.?

కొడుకును, కూతుర్నే కంట్రోల్ చేయలేని కేసీఆర్, పార్టీని ఏ విధంగా కంట్రోల్ చేస్తాడు అన్న అభిప్రాయానికి కారణమవుతుంది. మరీ ముఖ్యంగా దశాబ్దకాలం అప్రతిహతంగా తెలంగాణ రాష్ట్రంలో తిరుగులేని నాయకుడిగా పాలన సాగించిన కేసీఆర్ ప్రస్తుతమున్న పరిస్థితులతో చేతులెత్తేసినట్టు కనిపిస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు తీసుకున్న ఈ నిర్ణయం బిఆర్ఎస్ పార్టీని నిండా ముంచేసే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### పార్టీ దారి తప్పిందా.? కేసీఆర్ ఏం చేస్తారు.?

బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి అయిపోయిందని, పార్టీ దారి తప్పిందని, అధినేత చేతుల్లో ఏమీ లేదు అన్న సంకేతాలు పార్టీ శ్రేణుల దాకా వెళుతున్నాయి. గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్న బీఆర్ఎస్, అధినేత కెసిఆర్ ఈ పరిస్థితుల నుంచి బయట పడతారా.? మళ్లీ పార్టీని దూకుడుగా ముందుకు తీసుకు వెళ్ళ గలుగుతారా.? అనేది భవిష్యత్తును కాలమే నిర్ణయించాలి.

# ఆలోచన అదిరిందిగా

## - సీబీఐ విచారణ కాంగ్రెస్ ఎత్తుగడలో భాగమేనా.?





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ కాంగ్రెస్ మాత్రం ఒక విషయంలో రాజకీయ చతరతను చాటింది. వ్యూహాత్మకంగా ఎత్తుగడ వేసింది. ముఖ్యంగా రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై విచారణను సీబీఐకి అప్పగించడం రెండు పార్టీలను ఇరకాటంలోకి నెట్టడమేనంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో తమకు ప్రత్యర్థి పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలను ఇబ్బందుల్లోకి నెట్టేందుకు మాత్రమే సీబీఐకి కాళేశ్వరం ప్రాజెక్టు విచారణను అప్పగించారన్నది వాస్తవం. కాళేశ్వరం ప్రాజెక్టు లో జరిగిన అక్రమాలపై మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు సీబీఐకి అప్పగించాలని శాసనసభ నిర్ణయించినా ముందుగా ముఖ్యమంత్రి తో పాటు మంత్రులు కూడా సీబీఐకి అప్పగించాలని డిసైడ్ అయి శాసనసభలో చర్చ పెట్టి తీర్మానం చేశారు.

### ప్రత్యర్థి పార్టీలను..

ఎవరు అవునన్నా కాదన్నా తెలంగాణలో ప్రధాన ప్రత్యర్థి బీఆర్ఎస్. దానిని నేరుగా రాష్ట్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలచేత విచారణ చేయించి చర్యలు తీసుకుంటే, ఒకవేళ కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై కేసీఆర్ ను అరెస్ట్ చేయడానికి సిద్ధమయితే అది కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయంగా నష్టం జరుగుతుంది. బీఆర్ఎస్ కు సానుభూతి పెరుగుతుంది. లక్షా నలభై ఏడు వేల కోట్ల రూపాయలు వ్యయం చేసి నిర్మించి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించినా చుక్క నీరు అందకపోగా, మేడిగడ్డ కూలిపోయిందన్న రాజకీయ విమర్శల వరకూ కాంగ్రెస్ చేయవచ్చు. అదే చర్యలకు దిగితే అది కారు పార్టీకి సానుభూతిగా మారి తమకు రాజకీయంగా ఇబ్బందులు ఎదురవుతాయి.

### సీబీఐ విచారణ అంటే..

అదేసమయంలో బీజేపీ కోర్టులోకి బంతి నెట్టాలని కూడా కాంగ్రెస్ చేసిన ప్రయత్నంగా కనిపిస్తుంది. సీబీఐ విచారణ అంటే అది కేంద్ర ప్రభుత్వం అధినంలో ఉంటుంది. సీబీఐ అంటే కేంద్రం చెప్పినట్లే నడుస్తుందని, దాని జేబు సంస్థ అని కూడా చాలా మంది నమ్ముతారు. అందుకోసమే కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై విచారణను కేంద్రం కోర్టులోకి నెట్టేశారు. సీబీఐ విచారణ అంటే సుదీర్ఘకాలం సాగుతుంది. ఈ విషయం అనేక కేసుల్లో వెల్లడియింది. ఈ కేసులో సీబీఐ విచారణలో ఆలస్యం జరిగితే అది బీజేపీ పై కూడా విమర్శలు చేయడానికి ఉపయోగపడుతుంది. అందుకోసమే తన చేతికి మట్టి అంటకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై విచారణను సీబీఐకి అప్పగించారన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. అయితే కాంగ్రెస్ చేసే విమర్శలను, సీబీఐ విచారణను జనం నమ్ముతారా? లేదా? అన్నది పక్కన పెడితే హస్తం పార్టీకి జరిగే రాజకీయ నష్టం మాత్రం తక్కువగా ఉండటానికే ఈ నిర్ణయం తీసుకున్నారన్న విషయం స్పష్టంగా అర్థమవుతుంది. మరొకవైపు బీజేపీ, బీఆర్ఎస్ పొత్తుకు కూడా రేవంత్ రెడ్డి ఈ నిర్ణయంతో చెక్ పెట్టినట్లయింది.

### సీబీఐ కేసులు వేలల్లో పెండింగ్..

మరొకవైపు కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ పరిధిలో ఉన్న 7,072 అవినీతి కేసుల విచారణ పలు కోర్టుల్లో పెండింగ్ లో ఉందని కేంద్ర నిఘా కమిషన్ తన వార్షిక నివేదికలో వెల్లడించింది. దీనిలో 379 కేసులు ఇరవై ఏళ్లకు పైగా పెండింగ్ లో ఉండటం గమనార్హం. విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం.. గతేడాది డిసెంబరు 31 నాటికి 1,506 కేసులు మూడేళ్లలోపు పెండింగ్ లో ఉన్నాయని పేర్కొంది. ఇది ఎంతగానో ఆందోళన కలిగించే విషయమని కేంద్ర నిఘా కమిషన్ పేర్కొంది. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి అప్పగించడంతో ఈ కేసు కూడా ఏళ్లు పట్టే అవకాశముందని అర్థమవుతుంది. దీంతో కాళేశ్వరం కేసులో మళ్లీ ఎన్నికల వరకూ ఏమీ తేలే అవకాశం మాత్రం లేదనే చెప్పాలి.

## అతిథి అధ్యాపకులకై దరఖాస్తుల ఆహ్వానం

**- మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ**

**- దరఖాస్తులకు చివరి తేదీ సెప్టెంబర్ 4**

**- సెప్టెంబర్ 6వ తేదీన సర్టిఫికెట్ వెరిఫికేషన్**

**- పీహెచ్డీ/ నెట్/సెట్ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత**



**జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)** స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2025 –26 విద్యా సంవత్సరానికి గాను కంప్యూటర్ సబ్జెక్టు బోధించుటకు అతిధి అధ్యాపకులకై అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జగిత్యాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్–1 బోధించుటకు అతిధి అధ్యాపకలు అవసరం కలదని పేర్కొన్నారు. ఇందుకుగాను సంబంధిత సబ్జెక్టులలో పీజీ లో 55% మార్కులు ఎస్సీ ఎస్టీలకు 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. పీహెచ్డీ/ నెట్/సెట్ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడునని తెలిపారు, బోధన అనుభవం సర్టిఫికెట్ గల వారికి ప్రాదాన్యత ఇవ్వబడును. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 4వ తేదీలోగా ఉదయం 10 నుండి సాయంత్రం 4 గంటల వరకు కళాశాల పని దినములలో తమ దరఖాస్తులను సంబంధిత సర్టిఫికెట్స్ జిరాక్స్ తో పాటు కళాశాల కార్యాలయం లో సమర్పించాలని తెలిపారు. సెప్టెంబర్ 6వ తేదీన, శనివారం రోజు ఉదయం 10 గంటలకు కళాశాలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించబడునని తమ ఒరిజినల్ సర్టిఫికెట్ తో పాటు హాజరుకావాలని తెలిపారు.

## తన తల్లి హీరాబెన్‌పై అనుచిత వ్యాఖ్యలు

**- తీవ్రంగా స్పందించిన మోదీ**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దివంగతురాలైన తన తల్లి హీరాబెన్‌ను ఉద్దేశించి బీహార్ లో కొందరు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భావోద్వేగంతో స్పందించారు. అది కేవలం తన తల్లికి జరిగిన అవమానం కాదని, దేశంలోని కోట్లాది మంది తల్లులు, సోదరీమణులను కించపరచడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీహార్‌లో ఇటీవల కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నిర్వహించిన ఓ ర్యాలీలో ఈ వ్యాఖ్యలు చేసినట్లు బీజేపీ ఆరోపించింది. మంగళవారం నాడు బీహార్‌కు చెందిన సుమారు 20 లక్షల మంది మహిళలతో వర్చువల్ సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ “కాంగ్రెస్, ఆర్జేడీ నేతలు పాల్గొన్న సభలో నా తల్లిని దూషించారు. ఆ మాటలు నన్ను తీవ్రంగా బాధించాయి. బీహార్ ప్రజలు కూడా ఈ వ్యాఖ్యలతో బాధపడ్డారని నాకు తెలుసు” అని అన్నారు. తన తల్లి పడిన కష్టాలను గుర్తుచేసుకుంటూ, “మా బట్టల కోసం ప్రతి పైసా కూడబెట్టింది. అనారోగ్యంతో ఉన్నా పనిచేసి కుటుంబాన్ని పోషించింది. దేశంలో అలాంటి తల్లులు కోట్లాది మంది ఉన్నారు. తల్లి స్థానం దేవుడి కంటే గొప్పది” అని మోదీ ఉద్వేగానికి లోనయ్యారు. రాజకుటుంబాల్లో పుట్టిన రాహుల్ గాంధీ, తేజస్వీ యాదవ్‌లకు ఒక పేద తల్లి పడిన బాధ, ఆమె కొడుకు చేసే పోరాటం అర్థం కావని విమర్శించారు. అధికారం కోసం స్వార్థంతో పనిచేస్తున్నారని, ప్రజలు తనను ఆశీర్వదించి ప్రధానిని చేస్తే కొందరు జీర్ణించుకోలేకపోతున్నారని మండిపడ్డారు. మోదీ తల్లిపై వ్యాఖ్యల పట్ల బీజేపీ నేతలు పాట్నాలోని కొత్వాలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు. మరోవైపు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ వ్యాఖ్యలపై స్పందిస్తూ, రాహుల్ గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## కేసీఆర్, హరీశ్ రావులకు ఊరట

**- కాళేశ్వరం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దన్న హైకోర్టు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు చేపట్టవద్దని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. కమిషన్ నివేదిక ఆధారంగా తమపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వాన్ని నిరోధించాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు దాఖలు చేసిన పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకల కేసును దర్యాప్తు కోసం సీబీఐకి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన కోర్టుకు తెలిపారు.

సీబీఐ దర్యాప్తునకు, జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికకు ఎలాంటి సంబంధం ఉండదని కూడా ఏజీ స్పష్టం చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, ఈ పిటిషన్‌పై లోతైన విచారణ జరపాల్సి ఉందని అభిప్రాయపడింది. వెకేషన్ అనంతరం దీనిపై విచారణ చేపడతామని పేర్కొంటూ, తదుపరి విచారణను అక్టోబర్ 7వ తేదీకి వాయిదా వేసింది. అప్పటివరకు పిటిషనర్లపై జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎటువంటి చర్యలు తీసుకోరాదని స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులతో కేసీఆర్, హరీశ్ రావులకు తాత్కాలికంగా ఊరట లభించినట్లయింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588